వాయిస్ ఆఫ్ ప్రజలు
TGTEL/25/A2649
# వాయిస్ టుడే
VOICE OF PRAJALU
దినపత్రిక
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం – మననేత్రం
Follow
పేజీలు 10
బుధవారం, ఫిబ్రవరి 11, 2026
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## అమెరికా-కెనడా బ్రిడ్జిని అడ్డుకుంటా: ట్రంప్




వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కెనడాపై మళ్లీ విరుచుకుపడ్డారు. అమెరికా-కెనడాను కలుపుతూ రూ.57 వేల కోట్లు ఖర్చు చేసి నిర్మించిన 'గోర్డీ హోవే' వంతెన ప్రారంభోత్సవాన్ని అడ్డుకుంటానని ట్రంప్ బెదిరింపులకు దిగారు. అమెరికా కెనడాకు ఇచ్చిన 'ప్రతిదానికీ పూర్తిగా పరిహారం' చెల్లించే వరకు వంతెన ప్రారంభోత్సవం జరగదు అని తేల్చేశారు. 'బై అమెరికన్ యాక్ట్'ను పక్కనపడేసి, చైనాతో కెనడా వాణిజ్య సంబంధాలు ఏర్పరుచుకోవటంపై ఆయన మండిపడ్డారు.

# తెలంగాణ బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లులు.. కేంద్రం నుంచి కీలక ప్రకటన

**బీసీ రిజర్వేషన్ల బిల్లులపై ప్రశ్నించిన బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్**

**శాసన సభ కార్యదర్శి నుంచి రెండు బిల్లులు వచ్చినట్లు కేంద్రం వెల్లడి**

**ప్రస్తుతం అవి పరిశీలనలో ఉన్నాయన్న కేంద్రమంత్రి**


2లో



# నేడే మున్సి 'పోల్'

- 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు జరగనున్న ఎన్నికలు
- ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్
- 52.17 లక్షల మంది ఓటర్లు.. 2,981 వార్డులు, 12,944 అభ్యర్థులు
- 8,191 పోలింగ్ కేంద్రాలు.. 100% కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్
- ఫిర్యాదుల స్వీకరణకు 9240021456 టోల్ ఫ్రీ నంబర్
- పోలింగ్ ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు నేడు సెలవు

హైదరాబాద్: రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు బుధవారం జరగనున్న ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల పర్యిధిలోని 8,191 పోలింగ్ కేంద్రాల్లో 52.17 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉంది. 2,981 వార్డులు, డివిజన్లకు గాను 12,944 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీతో పాటు సీపీఐ, సీపీఎం, ఆప్, ఎంఐఎం, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ తదితర పార్టీలు, స్వతంత్రులు బరిలో నిలిచారు. కాగా మున్సిపాలిటీల్లో 12 మంది కౌన్సిలర్లు, మున్సిపల్ కార్పొరేషన్లలో ఇద్దరు కార్పొరేటర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మక్తల్ మున్సిపాలిటీలోని ఆరో వార్డు బీజేపీ అభ్యర్థి ఎరుకల మహదేవప్ప మరణంతో అక్కడ ఎన్నిక వాయిదా పడింది.

- మిగతా 2వ పేజీలో

# ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్!

**భారాస హయాంలో వాడిన పరికరాలే ఇప్పటికీ యాక్టివ్**

**ఫోన్ ట్యాపింగ్‌పై మంత్రి పొంగులేటి సంచలన ఆరోపణలు**

**ఫాంహౌస్‌లు, ఇళ్లలో దాచిన పరికరాలపై విచారణకు ఆదేశాలు**

**ఉద్యోగులతో మాట్లాడిన విషయం బయటకు రావడమే సాక్ష్యమంటూ వ్యాఖ్య**

ఖమ్మం: భారాస పాలనలో అక్రమంగా ఫోన్ ట్యాపింగ్‌కు ఉపయోగించిన పరికరాలను ఇప్పటికీ వినియోగిస్తున్నారని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. తమ ఫోన్లు ప్రస్తుతం కూడా ట్యాప్ అవుతున్నాయన్న అనుమానాలు బలపడుతున్నాయని తెలిపారు. ఈ అంశాన్ని ప్రభుత్వం అత్యంత గంభీరంగా పరిగణిస్తోందని, పరికరాలు ఎక్కడ దాచారన్న దానిపై లోతైన విచారణ చేపడతామని స్పష్టం చేశారు. మంగళవారం ఖమ్మంలో మీడియాతో మాట్లాడిన మంత్రి.. అక్రమంగా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన వారిని గుర్తించి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏయే ఇళ్లలో, ఫాంహౌస్‌లలో ఈ పరికరాలు ఉన్నాయో, ఎంతమంది ఫోన్లను అక్రమంగా వినిపిస్తున్నారో పూర్తిస్థాయిలో తేలుస్తామని తెలిపారు.



### ఫోన్ సంభాషణ ఎలా లీక్ అయింది?

ఉద్యోగులతో తాను నిర్వహించిన ఫోన్ సంభాషణను భారాస నాయకులు విడుదల చేయడంపై మంత్రి తీవ్రంగా స్పందించారు. "మంత్రిగా ఉద్యోగులతో సమీక్షలు జరపడం సహజం. అలాంటి ఫోన్ కాల్స్ వివరాలు వారికి ఎలా తెలిసాయి? అంటే ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్ కొనసాగుతోందనే అనుమానం బలపడుతోంది" అని వ్యాఖ్యానించారు. ఉద్యోగులు ఓటర్లు కాదా? పార్టీకి ఓటేయాలని అడగడం తప్పేంటని ప్రశ్నించారు.

### మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

బుధవారం రాష్ట్రవ్యాప్తంగా 116 పురపాలికలు, ఏడు కార్పొరేషన్లకు పోలింగ్ జరగనున్న నేపథ్యంలో మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 80 శాతం కంటే ఎక్కువ స్థానాల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ గెలుపు ఖాయమనే నిజాన్ని జీర్ణించుకోలేక భారాస నాయకులు ఆక్రోశంతో వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

### అప్పుల భారం మధ్యలోనూ సంక్షేమం

గత ప్రభుత్వం చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పులకు అసలు, వడ్డీలు చెల్లిస్తూనే అభివృద్ధి ఆగకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని మంత్రి చెప్పారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా తీసుకున్న నిర్ణయాలకే ప్రజలు శాసనసభ ఉప ఎన్నికలు, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చారన్నారు.

### ఇందిరమ్మ ఇళ్లపై స్పష్టత

రాష్ట్రంలో ఇప్పటికే 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఏప్రిల్ నుంచి రెండో విడత ఇళ్ల మంజూరు ప్రారంభమవుతుందని, ఆ తర్వాత మూడో విడత కూడా చేపడతామని తెలిపారు. సీపీఐ నేత నారాయణ వ్యాఖ్యలపై స్పందించిన పొంగులేటి.. తాను సీఎం రేసులో లేనని స్పష్టం చేశారు. "నేను సామాన్య కార్యకర్తనే. పార్టీ ఇచ్చిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించడమే నా లక్ష్యం" అని చెప్పారు.



## నా పేరును మార్చడానికి మీరెవరు?

- రేవంత్ రెడ్డిపై కిషన్ రెడ్డి ఆగ్రహం
- మా తల్లి పెట్టిన పేరును మార్చి పిలువడమేమిటని ఆగ్రహం
- అవసరమైతే రేవంత్ ఖాన్‌గా మార్చుకోవాలని ఎద్దేవా
- అన్ని స్థానాల్లో మజ్లిస్ పార్టీ ఎందుకు పోటీ చేయడం లేదని నిలదీత

2లో



## కార్యకర్తలు ధైర్యంగా ఉండండి..

- బీజేపీ నాయకత్వం మీకు అండగా ఉంది: బండి సంజయ్
- గిరిజన బిడ్డ ఎరుకల మహదేవప్ప ఆత్మహత్య
- ఆత్మహత్యపై స్పందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

# హైదరాబాద్‌లో రూ.1,511 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

**ఆక్రమణలపై నగరం నలువైపులా హైడ్రా చర్యలు**

**కొండాపూర్‌లో 4 ఎకరాల చెరువును కాపాడిన హైడ్రా**

**అల్వాల్ కొత్త చెరువు ఆక్రమణలు 8 ఎకరాల మేర తొలగింపు**

**రాధాకృష్ణ నగర్‌లో 450 గజాల పార్కును కాపాడిన హైడ్రా**

**జక్కిడి కాలనీలో 650 గజాల పార్కుకు ఫెన్సింగ్**

హైదరాబాద్‌లో నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో హైడ్రా రూ.1,511 కోట్ల విలువైన భూమిని రక్షించింది. ప్రభుత్వ భూములు, పార్క్ స్థలాలను ఆక్రమణల చెర నుంచి హైడ్రా విడిపించింది. ఆ భూముల చుట్టూ ఫెన్సింగ్ వేసి బోర్డులను ఏర్పాటు చేసింది. ఆక్రమణలను సీరియస్‌గా పరిగణిస్తున్న హైడ్రా... పార్కులు, చెరువులను ఆక్రమించిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తోంది.

### కొండాపూర్‌లో చెరువును కాపాడిన హైడ్రా

శేరిలింగంపల్లి మున్సిపల్ కార్యాలయం – మదీనాగూడ రోడ్డు మార్గం కొండాపూర్‌లో రూ. 700 కోట్ల విలువైన భూమిని హైడ్రా కాపాడింది. 4 ఎకరాల జంగం కుంటను పూడ్చేసి మట్టితో చదును చేసి ప్లాట్లుగా విక్రయించేందుకు సిద్ధమైన కబ్జాదారుల ఆట కట్టించింది. ఇటీవల మీడియాలో వచ్చిన కథనాల మేరకు రెవెన్యూ అధికారులతో హైడ్రా జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేసింది. జంగం కుంటగా హైడ్రా నిర్ధారించుకుంది. కబ్జా చేసిన వారిపై రెవెన్యూ అధికారులు కేసులు కూడా పెట్టారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు ఫెన్సింగ్ వేసింది.



### అల్వాల్ కొత్త చెరువులో ఆక్రమణల తొలగింపు

మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా అల్వాల్ మండలంలోని అల్వాల్ కొత్త చెరువు 8 ఎకరాల మేర ఆక్రమణలను హైడ్రా తొలగించింది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ప్లాస్టిక్ కంప్రెసివ్ యూనిట్, ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ కార్యకలాపాలు నిర్వహిస్తూ చెరువును

- మిగతా 2వ పేజీలో



# కృష్ణా జలాల దోపిడీపై రేవంత్ సర్కార్ మౌనం: హరీష్

- ఏపీ 80% నీటిని దోచుకుంటుంటే సీఎం ఏం చేస్తున్నారు?
- అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌ను తక్షణమే డిమాండ్ చేయాలి.
- జూబ్లీహిల్స్ ప్యాలెస్‌కే పరిమితమైన రేవంత్ రెడ్డి.
- రాష్ట్ర హక్కుల రక్షణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోర వైఫల్యం.
- ఈఎన్‌సీ పోస్టుల భర్తీపై సర్కార్ నిర్లక్ష్యం వీడాలి : హరీష్

## నా పేరును మార్చడానికి మీరెవరు?

మా తల్లి పెట్టిన పేరును మార్చి పిలవడానికి మీరెవరంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాను ఎవరికో దత్తపుత్రుడినని, కల్వకుంట్ల కిషన్ రావు అని పేరు మార్చుకోవాలని ముఖ్యమంత్రి విమర్శలు చేయడం ఏంటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తన పేరు మార్చి పిలవడం సరికాదని అన్నారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి మధ్య ఏమైనా ఉంటే వారే తేల్చుకోవాలని, తనను మధ్యలోకి లాగవద్దని సూచించారు. అంతగా అవసరమైతే మీరు రేవంత్ ఖాన్ అని మార్చుకోవచ్చని, తమకు ఎలాంటి అభ్యంతరం లేదని అన్నారు. కానీ మా తల్లి పెట్టిన పేరును మార్చడానికి మీరెవరని ప్రశ్నించారు. వ్యక్తిగత విమర్శలు సరికాదని హితవు పలికారు. మజ్లిస్ పార్టీతో కలిసి ముందుకు సాగినన్ని రోజులు మేం నిలదీస్తూనే ఉంటామని అన్నారు. తెలంగాణలో అన్ని స్థానాల్లో మజ్లిస్ పార్టీ ఎందుకు పోటీ చేయడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్‌ను అరెస్టు చేయాలంటూ మాకు చెప్పడమేమిటని ప్రశ్నించారు. కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అరెస్టు చేస్తే ఎవరూ అడ్డురాకుండా తాను చూసుకుంటానని అన్నారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డిదా? లేక కిషన్ రెడ్డిదా? తెలంగాణ ప్రజలు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంకలు ఒక్కసారైనా కేసీఆర్‌కు వ్యతిరేకంగా మాట్లాడారా అని ప్రశ్నించారు. బీజేపీ ఎప్పుడూ బీఆర్ఎస్ పార్టీతో కలవలేదని స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసి ఎన్నికల్లో పోటీ చేశాయని గుర్తు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను రెండేళ్లు పూర్తయినా అమలు చేయలేదని విమర్శించారు. మక్తల్ బీజేపీ అభ్యర్థి మహదేవప్ప మృతికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని అన్నారు.

## అస్సాంలో 2.43 లక్షల ఓట్ల తొలగింపు

గౌహతి: అస్సాంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ పూర్తయింది. తుది ఓటర్ల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం ప్రచురించింది. 2.43 లక్షల ఓటర్ల పేర్లను ముసాయిదా జాబితా నుంచి తొలగించారు. తుది జాబితాలో 2.49 కోట్ల మంది ఓటర్లకు స్థానం కల్పించారు. ముసాయిదా జాబితాతో పోలిస్తే 0.97 శాతం ఓటర్లు తగ్గిపోయినట్లు అస్సాం చీఫ్ ఎలక్టోరల్ అధికారి (సీఈఓ) ఒక ప్రకటనలో వెల్లడించారు. తుది జాబితాలో 1.25 కోట్ల మంది పురుషులు, 1.24 కోట్ల మంది మహిళలున్నారు. గత ఏడాది డిసెంబర్ 27న ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో 2.52 కోట్ల మంది ఓటర్లు ఉండగా, తుది జాబితాలో 2.49 కోట్ల మంది ఉన్నారు. అస్సాంలో మరికొన్ని నెలల్లో తాజా జాబితా ఆధారంగానే అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. అర్హుల పేర్లు గల్లంతైతే దరఖాస్తు చేసుకోవచ్చని ఈసీ సూచించింది.

## తెలంగాణ బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లులు.. కేంద్రం నుంచి కీలక ప్రకటన

తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లులు పరిశీలనలో ఉన్నాయని లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం తెలిపింది. తెలంగాణలో విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడంపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ప్రశ్నించారు. దీనితో కేంద్ర మంత్రి బీఎల్ వర్మ వివరణ ఇచ్చారు. రెండు బీసీ బిల్లులు రాష్ట్రపతి ఆమోదం కోసం వచ్చాయని, అవి పరిశీలనలో ఉన్నాయని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ పెంపునకు సంబంధించి తెలంగాణ శాసనసభ కార్యదర్శి నుంచి రెండు బిల్లులు రాష్ట్రపతి ఆమోదానికి వచ్చాయని తెలిపారు. ఈ బిల్లులు ప్రస్తుతం పరిశీలనలో ఉన్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ అసెంబ్లీలో ఆమోదం పొందిన రెండు బిల్లులను కేంద్ర ప్రభుత్వానికి పంపించడం తెలిసిందే.


## విడుదలైన టీఎస్ టెట్ జనవరి 2026 ఫలితాలు

**మొత్తం 51.37 శాతం మంది అభ్యర్థుల ఉత్తీర్ణత**

**పరీక్ష రాసిన ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో 57.76 శాతం మంది అర్హత**

**ఉద్యోగం నిలుపుకోవాలంటే టెట్ పాసవ్వాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలు**

**అర్హత సాధించని టీచర్లకు ఇంకా మిగిలి ఉన్న అవకాశం**



తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష జనవరి 2026 ఫలితాలు విడుదలయ్యాయి. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ ఇ. నవీన్ నికోలస్ మంగళవారం ఈ ఫలితాలను ప్రకటించారు. మొత్తం మీద 51.37 శాతం మంది అభ్యర్థులు అర్హత సాధించగా, ఈసారి ప్రభుత్వ ఉపాధ్యాయుల ఫలితాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఉద్యోగంలో కొనసాగాలంటే టెట్ తప్పనిసరిగా పాస్ కావాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో వేలమంది ప్రభుత్వ టీచర్లు అర్హత సాధించలేకపోవడం చర్చనీయాంశంగా మారింది. తాజా ఫలితాల ప్రకారం పరీక్షకు హాజరైన ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో 57.76 శాతం మంది (37,893 మంది) అర్హత సాధించారు. ఇతర అభ్యర్థుల ఉత్తీర్ణత శాతం (48.14 శాతం)తో పోలిస్తే ప్రభుత్వ టీచర్ల పనితీరు మెరుగ్గా ఉన్నప్పటికీ, గణనీయ సంఖ్యలో టీచర్లు విఫలమయ్యారు. మొత్తం మీద పరీక్ష రాసిన 1,95,181 మందిలో 1,00,270 మంది ఉత్తీర్ణులయ్యారు. టెట్ ప్రవేశపెట్టక ముందు నియమితులైన ప్రభుత్వ ఉపాధ్యాయులు రెండేళ్లలోపు టెట్‌లో అర్హత సాధించాలని గత ఏడాది సెప్టెంబర్‌లో సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ గడువులోగా ఉత్తీర్ణత సాధించలేకపోతే ఉద్యోగం కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో తాజా ఫలితాలు సర్వీసులో ఉన్న టీచర్లకు కీలకంగా మారాయి. టెట్‌లో అర్హత సాధించలేకపోయిన ఉపాధ్యాయులు తమ ఉద్యోగాలను నిలుపుకోవడానికి ఇంకా అవకాశం ఉంది. సుప్రీంకోర్టు నిర్దేశించిన రెండేళ్ల గడువులోపు జరిగే తదుపరి టెట్ పరీక్షల్లో వారు తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. టెట్ క్వాలిఫైయింగ్ సర్టిఫికెట్‌కు జీవితకాల వ్యాలిడిటీ ఉండటంతో పాటు, ఉపాధ్యాయ నియామక పరీక్ష లో 20 శాతం వెయిటేజీ లభిస్తుంది.

# హైదరాబాద్‌లో రూ.1,511 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా



కలుషితం చేస్తున్నారని స్థానికులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అలాగే అక్కడ పని వారికోసం తాత్కాలిక షెడ్డులు వేసి వ్యర్థాలన్నీ చెరువులోకి వదులుతున్నారని పేర్కొన్నారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని టెంటు సామగ్రికి చెందిన 4 షట్టర్లు కూడా వేసినట్టు ఫిర్యాదు చేశారు. హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చెరువు ఆక్రమణలను నిర్ధారించుకున్నారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎలాంటి కట్టడాలు, నిర్మాణాలు చేయరాదనే నిబంధన పట్టకుండా ఏర్పాటు చేసిన షెడ్డులను హైడ్రా తొలగించింది.

### 1100 గజాల పార్కులను కాపాడిన హైడ్రా

వనస్థలిపురం సాహెబ్‌నగర్ కలాన్‌లోని జక్కిడినగర్ కాలనీలో 650 గజాల పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడింది. సర్వే నంబరు 132, 133లో 1982లో 12 ఎకరాల మేర దాదాపు 161ప్లాట్లతో జక్కిడి కుటుంబ సభ్యులు లే ఔట్ వేశారు. ఇందులో 650 గజాల మేర పార్కుకోసం కేటాయించారు. 1985లోనే దీనిని ప్లాట్లుగా చేసి లే ఔట్ వేసిన వారే అమ్మేశారని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ప్రహరీతో పాటు రెండు షెడ్డులు నిర్మించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో హైడ్రా పరిశీలించి పార్కు స్థలంగా నిర్ధారించుకుంది. మంగళవారం ఆక్రమణలు తొలగించి పార్కు చుట్టూ ఫెన్సింగ్ వేసింది. పార్కు స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. మల్కాజిగిరి జోన్, మౌలాలి సర్కిల్ పరిధిలోని కాకతీయ నగర్‌లో రాధాకృష్ణ హౌసింగ్ కాలనీలో 450 గజాల పార్కును హైడ్రా కాపాడింది. జీహెచ్ఎంసీకి గిఫ్ట్ డీడ్‌గా ఇచ్చిన ఈ పార్కు స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన ప్రహరీతో పాటు రేకుల షెడ్డును హైడ్రా తొలగించింది.

# కృష్ణా జలాల దోపిడీపై రేవంత్ సర్కార్ మౌనం: హరీష్‌రావు

హైదరాబాద్: కృష్ణా నది జలాలను ఆంధ్రప్రదేశ్ అప్పనంగా తీసుకొని పోతుంటే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో కూర్చొని కళ్లప్పగించి చూస్తున్నాడని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్ నుంచి మీడియాతో మాట్లాడిన హరీష్‌రావు.. కృష్ణా జలాల 664 టీఎంసీలను , 80 శాతం ఆంధ్రప్రదేశ్ వాడుకుందని తెలంగాణ ఈఎన్‌సీ.. కేఆర్ఎంబీకి లేఖ రాశారని, మరి ఏపీ ప్రభుత్వం 80 శాతం నీళ్ళు వాడుకుంటే , రేవంత్ రెడ్డి , ఉత్తమ్‌లు గాడిద పళ్లు తోముతున్నారా?, 80 శాతం నీళ్ళు వాడుకుంటే, తెలంగాణ ప్రభుత్వం నిద్ర పోతుందా? అని నిలదీశారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయం పై అపెక్స్ కౌన్సిల్ మీటింగ్ ఎందుకు ఏర్పాటు చేయడం లేదని , ఆ కౌన్సిల్ మీటింగ్ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తుందని హరీష్ స్పష్టం చేశారు. రాష్ట్ర హక్కులను సీఎం రేవంత్‌రెడ్డి కాపాడాలని, ఈఎన్‌సీ పోస్టుల భర్తీపై సైతం సర్కార్ నిర్లక్ష్యంగా ఉందని హరీష్ మండిపడ్డారు.



# నేడే మున్సి 'పోల్'

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం పోలింగ్ నేపథ్యంలో ఎన్నికల సిబ్బంది పోలింగ్ సామగ్రితో సహా మంగళవారం సాయంత్రానికే తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. 123 పురపాలక సంఘాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ సిబ్బంది బ్యాలెట్ బాక్సులతో తరలివెళ్లారు. సాయంత్రం పోలింగ్ ముగిసిన తర్వాత అధికారుల పర్యవేక్షణలో బ్యాలెట్ బాక్సులను ముందే ఎంపిక చేసిన 137 స్ట్రాంగ్ రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విడతలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు తొలిసారిగా అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ వెబ్ కాస్టింగ్‌కు ఏర్పాట్లు చేశారు. తద్వారా పోలింగ్ కేంద్రాల లోపలా, వెలుపలా పోలింగ్ ప్రక్రియను అధికారులు పర్యవేక్షించనున్నారు. డ్రోన్ల ద్వారా పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో నిఘాను ఏర్పాటు చేశారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పెద్ద ఎత్తున పోలీసు బలగాలను మోహరిస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం రూపొందించిన 'టీ పోల్ మొబైల్ ఆండ్రాయిడ్ యాప్'లో ఓటర్లు తమ ఫోటో ఓటరు గుర్తింపు కార్డు నంబరు (ఎపిక్) సహాయంతో ఓటరు స్లిప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడంతో పాటు పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుసుకోవచ్చు. టీ పోల్ యాప్‌తో పాటు రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్‌లోని ఓటర్ పోర్టల్ నుంచి కూడా ఓటరు స్లిప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పోలింగ్ ప్రక్రియపై ఫిర్యాదులు, అభ్యంతరాల స్వీకరణ కోసం ఎన్నికల సంఘం టోల్ ఫ్రీ నంబరు 9240021456ను ఏర్పాటు చేసింది. కాగా ఈ ఎన్నికలు జరిగే ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు సెలవు ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రైవేటు వ్యాపార, వాణిజ్య సంస్థలు, పరిశ్రమల్లో పనిచేసే వారికి వేతనంతో కూడిన సెలవు వర్తింప చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# కార్యకర్తలకు బీజేపీ అండగా ఉంది

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల వేళ నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో భారతీయ జనతా పార్టీ 6వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి, గిరిజన బిడ్డ ఎరుకల మహదేవప్ప ఆత్మహత్య చేసుకొవడం తీవ్ర కలకలంగా మారింది. మాఫియా రాజకీయాలు, అహంకార ధోరణి తట్టుకోలేకే మహాదేవప్ప ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఆత్మహత్యపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు స్పందించారు. మహదేవప్ప ఆత్మహత్య చేసుకోవడం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. ఇది అత్యంత బాధాకరమైన ఘటన అని, మహదేవప్ప కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మహదేవప్పది ఆత్మహత్య కాదు కాంగ్రెస్ చేసిన హత్య అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. 'ఓటమి భయంతోనే బెదిరింపులు, అరాచకాలకు పాల్పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీని రాళ్లతో కొట్టే పరిస్థితి రాబోతోంది. మా సహనాన్ని పిరికితనంగా భావిస్తారా?. ఎన్నికల తరువాత కాంగ్రెస్‌పై యుద్ధం చేయబోతున్నాం. బీఆర్ఎస్ అరాచకాలకు ఎదురొడ్డి పోరాడిన చరిత్ర బీజేపీ కార్యకర్తలది. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేసే రోజులొచ్చాయి. బీజేపీ కార్యకర్తలారా.. ధైర్యంగా ఉండండి, నాయకత్వం మీకు అండగా ఉంది. మహదేవప్ప కుటుంబాన్ని పరామర్శించేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు బయలుదేరారు. మహదేవప్ప ఆత్మహత్యకు కారకులైన కాంగ్రెస్ నేతలను వెంటనే అరెస్ట్ చేయాలి. నిష్పాక్షికంగా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలి' అని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# స్పీకర్‌ను తొలగించాలి

న్యూఢిల్లీ: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు విపక్షాలు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. బిర్లాను స్పీకర్ పదవి నుంచి తొలగించాలని కోరుతూ ఆయనపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతామంటూ కాంగ్రెస్ పార్టీ మంగళవారం నోటీసిచ్చింది. రాజ్యాంగంలోని 94సి ఆర్టికల్ కింద లోక్‌సభ సెక్రెటరీ జనరల్ ఉత్పల్‌కుమార్ సింగ్‌కు దాన్ని అందజేసింది. "సభా వ్యవహారాల నిర్వహణలో ఓం బిర్లా పూర్తిగా ఏకపక్షంగా, విపక్షాల పట్ల వివక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు. తద్వారా స్పీకర్ వంటి రాజ్యాంగబద్ధ పదవిని దుర్వినియోగం చేస్తున్నారు"అని ఆరోపించింది. లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉప నేత గౌరవ్ గొగోయ్, ఆ పార్టీ చీఫ్ విప్ కె.సురేశ్, విప్ మొహ్మద్ జావెద్ విపక్షాల తరఫున మంగళవారం మధ్యాహ్నం సెక్రెటరీ జనరల్‌కు నోటీసు అందజేశారు. ఓం బిర్లాను లోక్‌సభ స్పీకర్ పదవి నుంచి తొలగించాలంటూ తీర్మానం ప్రవేశపెట్టేందుకు నోటీసిస్తున్నట్టు అందులో పేర్కొన్నారు. "సభలో పలుమార్లు విపక్ష సభ్యులను మాట్లాడేందుకు స్పీకర్ అనుమతించలేదు. ఫిబ్రవరి 2న రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై విపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రసంగాన్ని పూర్తి కూడా చేయనివ్వలేదు. స్పీకర్ వివక్షాపూరిత ధోరణికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. విపక్ష నేతను సభలో అసలు మాట్లాడనివ్వనే లేదు. ఫిబ్రవరి 4న ఒక బీజేపీ ఎంపీ మాజీ ప్రధానులపై అత్యంత అభ్యంతరకరంగా మాటల దాడి చేసేందుకు స్పీకర్ అనుమతించారు. పైగా అలా చేసినందుకు ఆయనను కనీసం ఒక్కసారైనా మందలించలేదు. ఇలాంటి ప్రవర్తనను అలవాటుగా మార్చుకున్న సదరు సభ్యునిపై తక్షణం చర్యలు తీసుకోవాలని మేం పదేపదే విజ్ఞప్తి చేసినా స్పీకర్ పట్టించుకోలేదు"అని నోటీసులో ఎంపీలు ఆరోపించారు. పలువురు కాంగ్రెస్ సభ్యులు సభలో ప్రధాని నరేంద్ర మోదీ స్థానం వద్దకు వెళ్లి 'అనూహ్య చర్య'కు దిగాలని భావించినట్టు కచ్చితమైన సమాచారం తన వద్ద ఉందని స్పీకర్ చేసిన ప్రకటనను కూడా వారు ప్రస్తావించారు. "స్పీకర్ చేసిన ఈ ఆరోపణలు పూర్తి నిరాధారం. అంతేగాక కాంగ్రెస్ ఎంపీల పరువుప్రతిష్టలకు భంగం కలిగించేలా ఉన్నాయి. పార్లమెంటరీ పద్ధతులను, నియమ నిబంధనలను పరిరక్షించాల్సిన స్పీకరే ఇలాంటి నిరాధారణ ఆరోపణలు చేసేందుకు నిండు సభను వాడుకోవడం దారుణం. ఇది



రాజ్యాంగబద్ధ పదవిని పూర్తిగా దుర్వినియోగం చేయడమే. ప్రజా సమస్యలపై గళమెత్తకుండా విపక్ష సభ్యులను స్పీకర్ పలుమార్లు అడ్డుకున్నారు"అంటూ నోటీసులో పేర్కొన్నారు. ఎనిమిది మంది విపక్ష ఎంపీలను ఏకపక్ష సస్పెండ్ చేయడం తదితరాలను కూడా అవిశ్వాస తీర్మానానికి కారణాలుగా వారు పేర్కొన్నారు. ఈ తీర్మానం మార్చి 9న సభ ముందుకు వచ్చే అవకాశమున్నట్టు లోక్‌సభ వర్గాలు పేర్కొన్నాయి.

# యువతలో సాహిత్య అధ్యయనం పెరగాలి




### తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్...

### ఓయూలో ముగిసిన తెలంగాణ లిటరరీ కాంగ్రెస్

సికింద్రాబాద్, ఫిబ్రవరి 10 (వాయిస్ టుడే ప్రతినిధి): నేటి సాంకేతిక పరిజ్ఞానంతో సాహిత్య పటనా ఆసక్తి తగ్గుతూ ఉందని వీరనారి చాకలి ఐలమ్మ తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం వైస్ చాన్సులర్ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్ పేర్కొన్నారు. మొబైల్ ఫోన్ తో అరచేతిలో ప్రపంచం ఉన్నప్పటికీ యువత పటనా ఆసక్తి ని పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మంగళవారం జరిగిన రెండవ తెలుగు లిటరరీ కాంగ్రెస్ ముగింపు సభ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింతకింది కాసిం అధ్యక్షతన జరిగింది. ఈ సభకు ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తెలుగు లిటరరీ కాంగ్రెస్ తో ఉస్మానియా యూనివర్సిటీలో ఒక పండుగ వాతావరణం నెలకొందన్నారు. సాహిత్యంలో కొత్త తరానికి తెలుగు లిటరరీ కాంగ్రెస్ ద్వారా అవకాశం ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమానికి హాజరైన యాట దశరథ్ మాట్లాడుతూ అమెరికాలో ఉన్నప్పటికీ ఉస్మానియా యూనివర్సిటీని, భారత్ ను మర్చిపోలేదన్నారు. ఏఐతో తెలుగు భాషకు ఉన్న లాభాలు నష్టాల గురించి ఆలోచించాలన్నారు. మలేషియా తెలుగు అసోసియేషన్ ప్రతినిధి వెంకట ప్రతాప్ సింహాచలం మాట్లాడుతూ గత రెండు వందల సంవత్సరాలుగా మలేషియాలో తెలుగు భాషను పరిరక్షిస్తున్న తీరు గురించి వివరించారు. తెలుగు సాహిత్య అకాడమీ బాలా చారి మాట్లాడుతూ సాహిత్యాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లేందుకు కృషి జరగాలన్నారు. సవాళ్లను అధిగమిస్తూ సాహిత్యకారులు ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ తెలుగు శాఖ అధ్యక్షులు ప్రొఫెసర్ సాగి కమలాకర శర్మ, పాఠ్య ప్రణాళిక సంఘం అధ్యక్షురాలు ప్రొఫెసర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### ఓయూలో కవిత జిందగీ.. కవిత దునియా.. హాజరైన గోరటి వెంకన్న

తెలంగాణ రెండవ లిటరరీ కాంగ్రెస్ ను పురస్కరించుకొని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ముందు "కవితా జిందగీ- కవిత దునియా" కార్యక్రమం పేరుతో మంగళవారం రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు యువ కవుల కవిత్వ పఠనంతో పాటు పాటలను పాడటం జరిగింది. విద్యార్థినీ విద్యార్థుల కవిత్వం, గానాలతో ఆర్ట్స్ కళాశాల ప్రాంగణం లోని ఆహుతులను ఆకట్టుకుంది. జానపద గాయకురాలు రోజా రమణి తన గొంతుతో విద్యార్థులను ఉత్సాహపరిచింది. ఈ కార్యక్రమంలో గాయకులు చరణ్ అర్జున్, రాము రాథోడ్ తమ పాటలతో విద్యార్థులను కేకలు పెట్టించారు. గోరటి వెంకన్న, వరంగల్ శ్రీనివాస్ మాట.. పాటతో విద్యార్థుల ను ఉత్సాహ పరుస్తూ సాహిత్య అభిలాషను కల్పించారు. తెలంగాణ లిటరరీ కాంగ్రెస్ అధ్యక్షులు ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింతకింది కాసిం తెలంగాణ లిటరరీ కాంగ్రెస్ ను విజయవంతం చేయడంలో పాల్గొన్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



## ఏకాగ్రతతో చదివి 10వ తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలి

### మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

సికింద్రాబాద్, ఫిబ్రవరి 10 (వాయిస్ టుడే ప్రతినిధి): విద్యార్థులు ఏకాగ్రతతో చదివి 10 వ తరగతి లో మెరుగైన ఫలితాలు సాధించాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన రాంగోపాల్ పేట డివిజన్ ఓల్డ్ గ్యాస్ మండి లో గల ఆదయ్య మెమోరియల్ స్కూల్ ను సందర్శించారు. ఈ సందర్భంగా 10 వ తరగతి విద్యార్థులను ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. 10 వ తరగతి పరీక్షల సందర్భంగా ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ స్నాక్స్ పంపిణీ చేశారు. అనంతరం స్కూల్ లోని సమస్యల గురించి ప్రధానోపాధ్యాయుడు, ఇతర సిబ్బంది ని అడిగి తెలుసుకున్నారు. స్కూల్ ఆవరణలో బోర్ రిపేర్ చేయించాలని, సి సి కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్కూల్ అభివృద్ధి, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. అదేవిధంగా స్కూల్ ఆవరణలో ఉన్న భవిత కేంద్రాన్ని సందర్శించి విద్యార్థుల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కేంద్రంలో విద్యార్థుల సౌకర్యార్థం కార్పెట్ ఏర్పాటు చేయాలని కోరగా, వెంటనే పంపిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ లు అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, అత్తిలి అరుణ గౌడ్, స్కూల్ ప్రధానోపాధ్యాయుడు బాలాజీ, సిబ్బంది భవాని, కల్పన, పుష్పలత, ఏఏపిసి చైర్మన్ లావణ్య, బి ఆర్ ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, ఆకుల హరికృష్ణ, నాయకులు కిషోర్, శ్రీహరి, కొండాపురం మహేష్ యాదవ్, సతీష్, గణేష్, జనార్దన్, రాజు, స్థానిక బస్తివాసులు లడ్డు, వినోద్, వినయ్, జగన్, శీను, అప్పి సురేష్ తదితరులు ఉన్నారు.

## స్వర్గీయ ఎమ్మార్పీఎస్ నాయకుడు రాజ ఎల్లయ్య మాదిగ 54వ జయంతి



సికింద్రాబాద్, ఫిబ్రవరి 10 (వాయిస్ టుడే ప్రతినిధి): సామాజిక ఉద్యమకారులు జాతీయ ఎమ్మార్పీఎస్ కార్యదర్శి స్వర్గీయ కొండూరు రాజ ఎల్లయ్య మాదిగ 54 వ జయంతి ఉత్సవాలు బన్సీలాల్ పెట్ "డి" క్లాస్ అంబేద్కర్ యువజన సంఘం లో ఆయన కుటుంబ సభ్యులు సతీమణి కే. భాగ్యలక్ష్మి, కే. రాజ మల్లమ్మ, కే. సుచేంద్ర గంధమాల స్పందన రమేష్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన సీనియర్ జర్నలిస్ట్ శేఖర్ మాట్లాడుతూ.. రాజ ఎల్లయ్య సమాజానికి చేసిన సేవలు మర్చిపోలేనివని కొనియాడారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి రెండు నిమిషాలు మౌనాన్ని పాటించి శ్రద్ధాంజలి ఘటించి ఘన నివాళి అర్పించారు. ఎమ్మార్పీఎస్ గజ్జల రాజశేఖర్ మాట్లాడుతూ... నిస్వార్థపూరిత జీవితం రాజ ఎల్లయ్య దని ఎమ్మార్పీఎస్ కోసం అహర్నిశలు కష్టపడ్డారని మాదిగ జాతి ఆయనకు రుణపడి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో

ఎమ్మార్పీఎస్ నాయకులు డి. నర్సింగ్ రావు, కుమార్ బాబు, వాసుదేవ్, జర్నలిస్ట్ పుల్లూరి మహేందర్ బీజేపీ నాయకులు వై. సురేష్, కే. కృష్ణ, కురుమ శంకర్, కుమార్, టిడిపి రాజు, సిద్దయ్య, జయరాం, కుమార్, ఎస్. రాజేందర్, మహేష్, ఎల్లయ్య, రాజేందర్, రాములు తోపాటు బస్తీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నగరవాసులకు మేయర్ కృతజ్ఞతలు



హైదరాబాద్: హైదరాబాద్ మహా నగరపాలక సంస్థ (జీహెచ్ఎంసీ)కి మేయర్గా ఐదేళ్లు బాధ్యతలు నిర్వర్తించడానికి అవకాశం ఇచ్చిన నగరవాసులకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మేయర్గా నగరాభివృద్ధికి శాయశక్తులా కృషి చేశానని పేర్కొన్నారు. నగరాభివృద్ధికి తోడ్పాటు అందించిన ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, మంత్రివర్గానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు చెప్పారు. తన పదవీకాలంలో సహకరించిన ప్రతి ఒక్కరికి ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

## మహిళా జర్నలిస్టులకు బెదిరింపులు ఆందోళనకరం



ఫిల్మ్నగర్: దేశంలో మహిళా జర్నలిస్టులు చట్టపరమైన బెదిరింపులు, వృత్తిపరమైన ఒంటరితనం, ఆన్లైన్ ట్రోలింగ్తో నిరంతరం వేధింపులకు గురవుతున్నారని, ఇది ప్రజాస్వామ్యానికే ముప్పని ఉస్మానియా విశ్వవిద్యాలయ జర్నలిజం విభాగం విశ్రాంత ఆచార్యురాలు పద్మజా షా ఆందోళన వ్యక్తంచేశారు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ప్రొ.బషీరుద్దీన్ 90వ జయంతి సందర్భంగా జరిగిన స్మారకోపన్యాసం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె 'జర్నలిజంపై మహిళల ప్రభావం' అనే అంశంపై మాట్లాడారు. ప్రొ.బషీరుద్దీన్ ఎంతో ముందుచూపుతో జర్నలిజం విభాగాన్ని తీర్చిదిద్దారని పేర్కొన్నారు. హక్కులపై గళమెత్తుతున్న మహిళల వల్లనే పరిశోధనాత్మక జర్నలిజానికి పునాది పడిందన్నారు. వీసీ ఆచార్య ఘంటా చక్రపాణి మాట్లాడుతూ విశ్వవిద్యాలయ అభివృద్ధికి ప్రొ.బషీరుద్దీన్ చేసిన సేవలు మరువలేనివన్నారు. సమాజాన్ని జాగృతం చేయడంలో మీడియా ఆశించిన స్థాయిలో లేదన్నారు. రిజిస్ట్రార్ డా.ఎల్.విజయాకృష్ణారెడ్డి, మీడియా అకాడమీ మాజీ చైర్మన్ దేవులపల్లి అమర్, జర్నలిజం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.సునీల్కుమార్ పాల్గొన్నారు.



## జి.వి.ఆర్. కరాటే అకాడమీ శిక్షణ మరియు ఉపాధి అవకాశాల పోస్టర్ ఆవిష్కరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 10: వాయిస్ టుడే: జీవీఆర్ కరాటే అకాడమీ బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మంగళవారం మేయర్ ఆఫీసులో నిర్వహించారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి శిక్షణార్థులకు (నిర్వాహకులు) అభినందనలు తెలుపుతూ, యువతకు నైపుణ్య శిక్షణ మరియు ఉపాధి అవకాశాల పట్ల ప్రోత్సాహకరమైన ప్రసంగం చేశారు. ఇలాంటి స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్లు యువతకు స్వయం ఉపాధి, ఆత్మవిశ్వాసం, మరియు భవిష్యత్ భద్రతలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. సమాజంలో యువతకు ప్రాధాన్యం మరియు నైపుణ్య శిక్షణ కల్పించడం ప్రభుత్వ విధానాల కంటే ప్రైవేట్ ఇనిస్టిట్యూషన్ల ద్వారా కూడా విజయవంతం కావచ్చని ప్రోత్సహించారు.

ఈ కార్యక్రమంలో హిమాయత్నగర్ కార్పొరేటర్ అండ్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యురాలు మహాలక్ష్మి రామన్న గౌడ్, జి.వి.ఆర్. కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీ. ఎస్. గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ బ్రోచర్లో రెండు సంవత్సరాల పాటు నిర్వహించనున్న స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ వివరాలు ఉన్నాయి. మొదటి సంవత్సరంలో కరాటే, సెల్ఫ్ డిఫెన్స్, శారీరక దృఢత్వం, క్రమశిక్షణ మరియు బోధనా నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వబడుతుంది. రెండవ సంవత్సరంలో పాఠశాలలు, కళాశాలలు మరియు వివిధ సంస్థల్లో ఇంటర్న్షిప్తో కూడిన బోధనా అనుభవం కల్పించి స్టైఫండ్ కూడా ఇవ్వబడుతుంది. ఆసక్తి గల అభ్యర్థులు 9494112424 నంబర్ను సంప్రదించవచ్చు. హైదరాబాద్ కేంద్రంగా సేవలు అందించబడతాయి.



## బాలయ్య నగర్లో శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి 22వ వార్షికోత్సవ జాతరలో హన్మంత్ రెడ్డి ప్రత్యేక పూజలు

కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 10(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మహాదేవపురం డివిజన్ పరిధిలోని బాలయ్య నగర్ లో వెలిసిన శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ దేవి ఆలయ 22 వ వార్షికోత్సవ జాతర మహోత్సవలు సందర్భంలో ప్రత్యేక పూజలు నిర్వహించబడ్డాయి. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ప్రధాన అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలు, ఆరోగ్యం, సమృద్ధి పొందాలని కోరారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యత మరియు శాంతిని పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేతలు, సిద్దనిల సంజీవరెడ్డి,బట్ట పాల కృష్ణ మైసిగారి శ్రీనివాస్ హమ్మి రెడ్డి మరియు ఆలయ కమిట్టి సభ్యులు పాల్గొన్నారు.



## జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే ఆశీస్సులు తీసుకున్న నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు

కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 10 (వాయిస్ టుడే) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు శ్రీ గాడిల వెంకటేశ్వర్లు తన జన్మదినాన్ని పురస్కరించుకుని పెట్బషీరాబాద్లోని క్యాంప్ కార్యాలయంలో బి.ఆర్.ఎస్.ఎల్.పి. విప్, ఎమ్మెల్యే శ్రీ కె.పి. వివేకానంద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, సమాజ సేవలో మరింత చురుకుగా పనిచేయాలని ప్రోత్సహించారు. ప్రజల సంక్షేమానికి అంకితభావంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఓం మణికంఠ నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు చీఫ్ సెక్రటరీ,వి.ఎస్.ఆర్.వెంకట్ నాయీ, చైర్మన్ జె.రవీందర్ నాయీ, మాజీ అధ్యక్షులు ఏ.రేణయ్య నాయీ, మహిళా అధ్యక్షురాలు మైలారం పద్మ నాయీ, పోచంపల్లి కృష్ణ నాయీ, బోరంపేట్ పరుశురామ్ నాయీ, సోషల్ మీడియా కన్వీనర్ శివ కుమార్ నాయీ, చింటూ నాయీ, మల్లంపేట్ అధ్యక్షులు విజయ్ నాయీ, అనిల్ నాయీ, రవికాంత్ నాయీ, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ దేవి వార్షికోత్సవంలో పాల్గొన్న స్థానిక కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 10(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మహాదేవపురం డివిజన్ పరిధిలోని బాలయ్య నగర్ లో గల శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ దేవి 22వ వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజుల నుండి జరుగుతున్న కార్యక్రమాలలో భాగంగా ముఖ్యమైన ఎల్లమ్మ జాతర సందర్భంగా స్థానిక మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు హాజరై ఆ రేణుక ఎల్లమ్మ దేవి ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు, అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 22 సంవత్సరాలుగా అమ్మవారి వార్షికోత్సవాలు నిర్వహించడం చాలా సంతోషమని అదేవిధంగా ఆ ఎల్లమ్మ దేవి ఆశిస్సులు కృపాకటాక్షాలు ఆయురారోగ్యాలతో ప్రజలంద రూ సుఖ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు స్థానిక డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు భక్తులు పాల్గొన్నారు.



## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

అల్లాపూర్ :- తేదీ 9 ఫిబ్రవరి 2026 సోమవారం రోజున కూకట్పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు ఆదేశాలతో అల్లపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా గౌసుద్దీన్ వివేకానంద నగర్ కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు మొత్తం మన కాలనీ అవసరాలకు ఉపయోగించుటకు గాను శ్రీ వివేకానంద నగర్ సంక్షేమ సంఘం కార్యవర్గం సమక్షంలో అధ్యక్షులు బొల్లు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి చెవ్వూరి మధుసూదన్ రావు గార్లకు మొదటి అంతస్తు తాళం చెవి అందజేయడం జరిగింది. ఇచ్చిన మాట నెరవేర్చినందుకు వివేకానంద నగర్ కాలనీ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేయడం జరిగినది తదుపరి గత పది సంవత్సరాలు కార్పొరేటర్ మేడం సబిహా గౌసిద్దేన్ చేసిన సేవలకు కృ సంక్షేమ సంఘం సభ్యులు కాలనీ తరఫున ధన్యవాదాలు తెలియజేస్తూ పుష్పగుచ్చం ఇచ్చి సాలువతో సన్మానించడం జరిగినది ఈ యొక్క కార్యక్రమంలో శ్రీ వివేకానంద నగర్ కాలనీ ప్రెసిడెంట్ బొల్లు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి చెవ్వూరి మధుసూదన్ రావు, చైర్మన్ తుంగం శ్రీనివాసరావు, కన్వీనర్ రోనంకి జగన్నాథం, మరియు గౌరవ కమిటీ సభ్యులు పిల్లి తిరుపతి, బండారు ప్రసన్నాంజనేయులు, గుత్తికొండ రామకృష్ణ, సిమ్మ షణ్ముఖరావు,సుందర శేషారావు, సనపల ప్రసాదరావు, దీవి ప్రభాకర్, ఆవుల ఆంజనేయులు, గోనుగుంట్ల సుబ్బయ్య చౌదరి, పేర బోయిన వీరాంజనేయులు, చిలకల చంద్రశేఖర్, తుంగం రామారావు, ఎంద్ర సింహాద్రి వంగా వెంకట సూర్యనారాయణ, సనపల ఆదినారాయణ, పైడి హరి నారాయణ, పి సత్య పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవలో ఐదేళ్లు
# అభివృద్ధి బాటలో హైదరాబాద్

**జిహెచ్ఎంసి డిప్యూటీ మేయర్‌గా పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసిన మోతే శ్రీలత శోభన్ రెడ్డి...**



సికింద్రాబాద్ ఫిబ్రవరి10 (వాయిస్ టుడే ప్రతినిధి): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) డిప్యూటీ మేయర్‌గా ఐదేళ్ల పాటు నిరంతర సేవలందించిన మోతే శ్రీలత శోభన్ రెడ్డి పదవీకాలం అధికారికంగా ముగిసింది. ఈ సందర్భంగా జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె తన పదవీకాలాన్ని సఫలీకృతం చేయడంలో సహకరించిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ప్రజాప్రతినిధులు, జిహెచ్ఎంసి కమిషనర్లు, ఉన్నతాధికారులు, ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు, డ్రైవర్లు, కార్యాలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, మీడియా ప్రతినిధులు, నగర ప్రజలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. డిప్యూటీ మేయర్‌గా తనకు అప్పగించిన బాధ్యతలను ప్రజాసేవే పరమావధిగా భావించి నిర్వర్తించానని ఆమె పేర్కొన్నారు. నగరవ్యాప్తంగా మౌలిక వసతుల అభివృద్ధి, రహదారి విస్తరణ, ఫుట్‌పాత్‌ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం, మురుగునీటి శుద్ధి కేంద్రాల అభివృద్ధి, తాగునీటి సరఫరా మెరుగుదల, చెత్త నిర్వహణలో ఆధునిక సాంకేతికత వినియోగం వంటి కీలక రంగాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను ముందుండి నడిపించానన్నారు.

ప్రత్యేకంగా 2020, 2021 సంవత్సరాల్లో సంభవించిన భారీ వర్షాలు, వరదల సమయంలో సహాయక చర్యలను సమన్వయం చేస్తూ, ప్రభావిత ప్రాంతాల్లో సహాయ శిబిరాలు ఏర్పాటు చేయడం, తక్షణ సహాయం అందించడం, పునరావాస చర్యలు చేపట్టడం ద్వారా బాధిత కుటుంబాలకు ధైర్యం చేకూర్చారని అధికారులు గుర్తుచేశారు. వరద నివారణ చర్యల్లో భాగంగా నాలాల అభివృద్ధి, బాక్స్ డ్రైన్ల నిర్మాణం, అక్రమ కట్టడాల తొలగింపు, వర్షపు నీటి సత్వర ప్రవాహానికి మార్గాలు కల్పించడం వంటి కీలక నిర్ణయాలు అమలు చేశారని తెలిపారు. మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ, స్వయం సహాయక సంఘాల బలోపేతం, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు, ఉచిత వైద్య పరీక్షలు, బాలికల విద్యకు ప్రోత్సాహం, మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని వివరించారు. అలాగే వృద్ధులు, వికలాంగులు, నిరుపేద వర్గాల సంక్షేమానికి అనేక పథకాలను ప్రజలకు చేరువ చేశారని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా నగరవ్యాప్తంగా భారీ స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాలు, పార్కుల అభివృద్ధి, సరస్సుల పునరుజ్జీవనం, జీవ వైవిధ్య పరిరక్షణ చర్యలు చేపట్టారని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించే దిశగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా స్వచ్ఛ హైదరాబాద్ లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషించారని అన్నారు. కోవిడ్--19 మహమ్మారి సమయంలో నగర ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ముందుండి పనిచేస్తూ, శానిటైజేషన్ డ్రైవ్స్, ఉచిత ఆహార పంపిణీ, క్వారంటైన్ కేంద్రాల పర్యవేక్షణ, వైద్య సేవల సమన్వయం వంటి కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేశారని తెలిపారు. పారిశుధ్య కార్మికులు, ఫ్రంట్‌లైన్ వర్కర్లకు రక్షణ సామగ్రి అందజేయడంలో ఆమె ప్రత్యేక శ్రద్ధ చూపారని అధికారులు తెలిపారు. ఈరోజుతో జిహెచ్ఎంసి ఎన్నికైన పాలకవర్గం ఐదేళ్ల పాలన కూడా ముగియనుంది. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి నాయకత్వంలో కొనసాగిన ఈ పాలకవర్గం నగరాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, ప్రజాసంక్షేమ కార్యక్రమాల్లో విశేషమైన పురోగతి సాధించి, హైదరాబాద్‌ను మరింత ఆధునిక నగరంగా తీర్చిదిద్దే దిశగా గట్టి అడుగులు వేసిందని పలువురు అభిప్రాయపడ్డారు.




# జీవో 259 రద్దు చేయాలి - కేబుల్ జర్నలిస్టుల భారీ ముట్టడి

**TUWJ, TUWJ 143,TUWJF**
**సంఘీభావం... ఐ అండ్ పి ఆర్ కార్యాలయం ఎదుట ఉద్రిక్త ధర్నా**



హైదరాబాద్ (వాయిస్ టుడే ప్రతినిధి) : కేబుల్ ఛానల్ జర్నలిస్టులకు తక్షణ అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేస్తూ, జీవో 259తో తమకు అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తూ కేబుల్ ఛానల్ జర్నలిస్టుల జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్ మాసబ్ ట్యాంక్‌లోని సమాచార పౌర సంబంధాల శాఖ (ఐ అండ్ పి ఆర్) కమిషనర్ కార్యాలయం ఎదుట భారీ ముట్టడి, ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ వివక్షపూరిత, కక్షపూరిత విధానాలకు వ్యతిరేకంగా జరిగిన ఈ నిరసన ఉద్రిక్తతల మధ్య కొనసాగింది. అక్రెడిటేషన్ లేకపోవడం వల్ల కేబుల్ ఛానల్ జర్నలిస్టులు వృత్తిపరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అధికారిక కార్యక్రమాలకు హాజరు కావడం, సమాచారం సేకరించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి పొందడం వంటి అంశాల్లో అవరోధాలు ఏర్పడుతున్నాయని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. వెంటనే జీవో 259ను పునఃసమీక్షించి కేబుల్ జర్నలిస్టులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ ఆందోళనకు జర్నలిస్టు సంఘాలు సంఘీభావం ప్రకటించడంతో కార్యక్రమానికి మరింత బలం చేకూరింది. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (TUWJ) అధ్యక్షులు విరహత్ అలీ, ౹ఖఔజీ 143 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్ పాల్గొని కేబుల్ జర్నలిస్టులకు మద్దతు తెలిపారు. అలాగే తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (TUWJF) అధ్యక్షులు మామిడి సోమయ్య కూడా నిరసనలో పాల్గొని జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు తమ సంఘం ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా నిలిచే మీడియా ప్రతినిధులను గుర్తింపు లేకుండా ఉంచడం సరైంది కాదని తీవ్రంగా విమర్శించారు. మీడియా రంగంలో పనిచేసే ప్రతి జర్నలిస్టుకు సమాన హక్కులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని, అక్రెడిటేషన్ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో TEMJU ప్రధాన కార్యదర్శి ఎ.రమణ కుమార్, పలు జర్నలిస్టు సంఘాల నాయకులు, సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని ఐక్యతను చాటారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను విస్తరింపజేస్తామని హెచ్చరించారు. "జీవో 259ను పునఃసమీక్షించి కేబుల్ ఛానల్ జర్నలిస్టులకు న్యాయం చేయాలి... జర్నలిస్టు హక్కుల కోసం పోరాటం కొనసాగుతుంది" అని నాయకులు స్పష్టం చేశారు.





# పోరాటాల నుంచే కార్మిక చట్టాలు





**- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య**

**లేబర్ కోడ్లతో ఉద్యోగ భద్రత, యూనియన్ హక్కులకు ముప్పు**

నాచారం (వాయిస్ టుడే):ఉద్యమాలు, పోరాటాల ద్వారానే కార్మిక హక్కులు, చట్టాలు సాధ్యమయ్యాయని, ఈ చారిత్రక సత్యాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గుర్తుంచుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య అన్నారు. ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిస్తూ మంగళవారం నాచారం చౌరస్తాలో నాచారం ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి, మేడ్చల్ జిల్లా సీఐటీయూ కోశాధికారి పి.గణేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్మిక సదస్సులో ఎస్.వీరయ్య ముఖ్య వ్యక్తగా హాజరై ప్రసంగిస్తూ.. కార్మికుల రక్తత్యాగాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కార్పొరేట్ లాభాల కోసం రద్దు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్లు అమలైతే ట్రేడ్ యూనియన్ హక్కులు, ఉద్యోగ భద్రత పూర్తిగా దెబ్బతింటాయని హెచ్చరించారు.

పర్మినెంట్ ఉద్యోగాలను తొలగించి కాంట్రాక్ట్, ఫిక్స్‌డ్ టర్మ్ ఉపాధిని శాశ్వతం చేయాలన్న ప్రభుత్వ యత్నం కార్మిక వర్గాన్ని ఆధునిక బానిసత్వంలోకి నెట్టే ప్రమాదం ఉందన్నారు. షాహీ పరిశ్రమలో 1,600 మంది మహిళా కార్మికులు ఎలాంటి యూనియన్లకు చెందకుండానే తమ వేతనాల కోసం పది రోజుల పాటు రాత్రింబవళ్లు పోరాడి హక్కులు సాధించుకున్న ఉదాహరణను ఆయన గుర్తు చేశారు. పోరాటం లేకుండా హక్కులు లభించవని ఇది స్పష్టంగా నిరూపిస్తోందన్నారు.

లేబర్ కోడ్ల పేరుతో కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్ల రద్దు కోసం 2026 ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు.

ఏఐటిఈయుసి రాష్ట్ర నాయకులు వి.ఎస్.బోసు మాట్లాడుతూ.. కార్మికులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు మూలం కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలేనని, కార్పొరేట్ లాభాల కోసం కార్మిక హక్కులు, రైతు ప్రయోజనాలను తాకట్టు పెడుతూ, లేబర్ కోడ్లు, విద్యుత్ సవరణ చట్టం, విత్తన బిల్లుల రూపంలో దాడి చేస్తోందని విమర్శించారు. ఈ విధానాలను వెనక్కి తీసుకునే వరకు కార్మికులు--రైతులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.

ఐఎన్టీయూసీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. కార్పొరేట్ వర్గాల ఒత్తిడికి లోబడి కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. లేబర్ కోడ్లు, ఇతర ప్రజావ్యతిరేక నిర్ణయాలను వెనక్కి తీసుకునే వరకు పోరాటం తప్పదని, ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలే కార్మిక వర్గంపై పెరుగుతున్న దాడులకు కారణమని విమర్శించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు జి.శ్రీనివాసులు, ఐ ఎఫ్ టి యు నాయకుల శివబాబు, ప్రవీణ్, ఎన్ ఐఈయు అధ్యక్షుడు శేఖర్ రెడ్డి, ఎఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శంకర్ రావు, సిఐఈయు అధ్యక్షుడు బివి సత్యనారాయణ, ఏపీరాక్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ మణికంఠ, వాయిత్ ఇండియా యూనియన్ ప్రధాన కార్యదర్శి సత్యంగౌడ్, కాకతీయ కెమికల్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, గ్రో కంట్రోల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి యం.డి.షకీల్, హోర్డ్సేస్ ఇంజినీరింగ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రమేష్, నాచారం, మల్లాపూర్ ఏరియా కార్మిక సంఘాలు వివిధ పరిశ్రమ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టీచర్ వేధింపులు భరించలేక
# విద్యార్థిని ఆత్మహత్యాయత్నం!



షాబాద్: మార్కులు తక్కువ వచ్చాయని టీచర్ తిట్టడంతో విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని అస్పల్లిగూడ క్రైట్ కాలేజ్ భవనంలో మహాత్మాజ్యోతి రావు పులే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల మొగిలిగిద్ద కేరెల్లిల వసతిగృహాలను నిర్వహిస్తున్నారు. మొగిలిగిద్ద పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థిని ఫిజిక్స్ టీచర్ తిట్టిందని ఈ నెల 5న షాంపూ తాగి ఆత్మహత్యకు యత్నించింది. 5 రోజుల తర్వాత విషయం తెలియడంతో మంగళవారం పాఠశాల ఉపాధ్యాయులు షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి పంపడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఫిజిక్స్ టీచర్ మందలించడం వల్లే ఆత్మహత్యకు యత్నించానని బాధితవిద్యార్థిని తెలిపింది. 3నెలలుగా తన కుమార్తెను పాఠశాల ఉపాధ్యాయులు వేధిస్తున్నారని, విద్యార్థులకు తిండి సరిగ్గా పెట్టకపోవడంతో అనారోగ్యం పాలవుతున్నారని విద్యార్థిని తల్లి ఆవేదన వ్యక్తం చేశారు. చదవడం చేతకాకే విద్యార్థిని ఇలా చేసిందని బీసీ గురుకుల ఆర్ సీవో రాజేష్ తెలిపారు. విషయం తెలుసుకున్న వెంటనే గురుకుల పాఠశాలను సందర్శించానని చెప్పారు.

## రైలుపట్టాలపై తలపెట్టి
# సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య

ఖైరతాబాద్: రైలు పట్టాలపై తలపెట్టి యువ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన ఖైరతాబాద్‌లో చోటు చేసుకుంది. నాంపల్లి రైల్వే పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. వరంగల్‌కు చెందిన వై.తరుణ్(30) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. అతడికి 2017లో కార్వాన్ సబ్జీమండికి చెందిన ప్రసన్నతో వివాహమైంది. వీరికి మూడేళ్ల కుమార్తె ఉంది. నగరంలోనే ఉద్యోగంచేస్తున్న ఆయన.. భార్యతో కలిసి అత్తారింటికి సమీపంలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఏడాదిగా మానసిక స్థితి బాగాలేక మందులు వాడుతున్నాడు. మంగళవారం భార్య తల్లిదండ్రుల వద్దకు వెళ్లగా.. అతడు ఉదయం 11 గంటలకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. మధ్యాహ్నం ఖైరతాబాద్ స్టేషన్ వైపు నుంచి నాంపల్లికి ఖాళీ ట్రైన్ వెళ్లేందుకు సిగ్నల్ పడింది. ఆ సమయంలో రైల్వేగేటు వద్ద ఓ వ్యక్తి పట్టాల మీదకు చేరుకోగా అక్కడి గేట్‌మన్ బయటకు వెళ్లాలని చెప్పగా వెళ్లిపోయాడు. కాసేపటి తర్వాత పట్టాలపై గేట్‌కు దాదాపు 100 అడుగుల దూరంలో ఒకరు చనిపోయిఉన్నట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న ఖైరతాబాద్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే అతడి పక్కన పడి ఉన్న ఫోన్ రింగ్ అవుతోంది. లిఫ్ట్ చేయగా ఆత్మహత్య చేసుకున్నది తరుణ్ అని తెలిసింది.

# స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించు కోవాలి

**అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు.**

**ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్.**

**పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో పరిశీలించిన జిల్లా మున్సిపల్ సాధారణ ఎన్నికల పరిశీలకులు**



రాజన్న సిరిసిల్ల జిల్లా; ఫిబ్రవరి 10 (వాయిస్ టుడే): మున్సిపల్ ఎన్నికల్లో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధి లోని ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పిలుపు ఇచ్చారు. ఈ నెల 11వ తేదీన బుధవారం సిరిసిల్ల, వేములవాడలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించనున్న సందర్భంగా వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల, సిరిసిల్ల గీతానగర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్, జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల సామగ్రి తీసుకున్న అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఎన్నికల అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చామని వెల్లడించారు. ఎస్ఈసీ నిబంధనలకు మేరకు

విధులు నిర్వర్తించాలని సూచించారు. పోలింగ్ అధికారులు, సిబ్బంది బ్యాలెట్ పేపర్, బ్యాలెట్ బాక్స్ లు చెక్ చేసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించామని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. పోలింగ్ కేంద్రం పరిధిలో 100 మీటర్ల వరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని స్పష్టం చేశారు. దివ్యాంగులకు ర్యాంపు, వీల్ చైర్ సౌకర్యం కల్పించా మని తెలిపారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలోని ఓటర్లు అందరూ పెద్ద సంఖ్యలో తరలి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపు ఇచ్చారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్స్ లు, బ్యాలెట్ పేపర్ అకౌంట్, పీఓ డైరీ రిసెప్షన్ కేంద్రాల్లో అప్పగించాలని వివరించారు. ఈ నెల 13 వ తేదీన సిరిసిల్ల, వేములవాడ సినారే కళామందిర్ లో కౌంటింగ్ కోసం అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో 39 వార్డులు, వేములవాడ మున్సిపల్ పరిధిలో 28 వార్డులు ఉన్నాయని, సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో 117, వేములవాడ మున్సిపల్ పరిధిలో 58 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో 39,942 మంది పురుషులు, 42,011 మంది మహిళా ఓటర్లు, 06 ఇతర ఓటర్లు ఉన్నారని, మొత్తం ఓటర్లు 81,959 మంది ఉన్నారని వెల్లడించారు. అలాగే వేములవాడ మున్సిపల్ పరిధిలో 19,580 మంది పురుషులు, 21,279 మంది మహిళా ఓటర్లు, 18 ఇతర ఓటర్లు, మొత్తం ఓటర్లు 40,877 మంది ఉన్నారని తెలిపారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో రిజర్వ్ స్టాఫ్ తో కలిపి రిటర్నింగ్ అధికారులు 15, వేములవాడ మున్సిపల్ పరిధిలో రిటర్నింగ్ అధికారులు 12 కలిపి మొత్తం 27 మందికాగా, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో 15, వేములవాడ మున్సిపల్ పరిధిలో 12 కలిపి మొత్తం 27 మందిని నియమించామని తెలిపారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో ప్రిసైడింగ్ అధికారులు 140, వేములవాడ మున్సిపల్ పరిధిలో ప్రిసైడింగ్ అధికారులను 70 మందిని, సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలలో కలిపి ఏపీఓలు మొత్తం 210 మంది, రెండు మున్సిపాలిటీల్లో ఓపీఓలు మొత్తం 630 మందిని నియామకం చేశామని వెల్లడించారు.ఓటు హక్కు వినియోగిం చుకోవడానికి ఓటరు జాబితాలో పేరుండి .. ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్ కార్డు) కాకుండా ఈ కింద చూపిన ప్రత్యామ్నాయ ఫొటో ఐడీలలో దేనినైనా ఒకటి పోలింగ్ సిబ్బందికి చూపి తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని వెల్లడించారు. ఆధార్, ఉపాధి హామీ జాబ్ కార్డు, బ్యాంకు, తపాలా కార్యాలయం జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్ బుక్, కేంద్ర కార్మికశాఖ జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు లేదా ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, నేషనల్ పాపులేషన్ రిజిస్టర్(ఎన్ఏఐ) కింద రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సెస్ కమిషనర్ ఇండియా(=+×) జారీ చేసిన స్మార్ట్ కార్డు, భారతీయ పాస్ పోర్ట్, ఫొటోతో కూడిన పెన్షన్ పత్రాలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, పీఎస్ యూలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఉద్యోగ గుర్తింపు కార్డులు, ఎంపీలు,ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డులు, కేంద్ర సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వ శాఖ జారీ చేసిన యూనిక్ డిజేబుల్ గుర్తింపు కార్డు (యూడీఐడీ)లు కలిగి ఉండాలని వివరించారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, తహసీల్దార్లు మహేష్ కుమార్, జయంత్ కుమార్, అధికారులు జగన్ మోహన్ రెడ్డి, శ్రీనివాసాచారి, భారతి, అన్సార్, మీర్జా ఫసహత్ అలీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.



## చిన్ననాడు చదువుకున్న పాఠశాలలోని పోలింగ్ బూత్ సందర్శించిన మంద మకరంద్

**విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి.**

**రాష్ట్ర మునిసిపల్ కమీషనర్ అండ్ తెలంగాణ ఎలక్షన్ కమిషన్ సెక్రటరీ మంద మకరంద్.**

రాజన్న సిరిసిల్ల జిల్లా; ఫిబ్రవరి 10 (వాయిస్ టుడే): కాకతీయ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి మంద మకరంద్ ఐఏఎస్ 2019 బ్యాచ్ ద్వారా సెలెక్ట్ అయి, జగిత్యాల ఉప కలెక్టర్ గా పని చేసి ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర మునిసిపల్ కమీషనర్ అండ్ తెలంగాణ ఎలక్షన్ కమిషన్ సెక్రటరీ గా ఉన్న బాధ్యత తో తను చదువుకున్న కాకతీయ ఇంగ్లీష్ మీడియం స్కూల్ సిరిసిల్ల లోనే పోలింగ్ బూత్ కూడా ఉన్నదని తెలిసి సంతోషంగా సందర్శించారు. కాకతీయ స్కూల్ లోని ఎస్ఎస్సి విద్యార్థులతో ముచ్చటస్తూ.. కెరీర్ గైడెన్స్ గురించి చెపుతూ.. నేను ఈ స్కూల్ లోనే చదువుకున్నాను. మీరు కూడా మంచి లక్ష్యం తో చదువాలని సూచించారు.



## అతి రుద్ర మహా యాగం, అభిషేకం నిర్వహించిన కాశీ విశ్వనాథ మందిర్

రాజన్న సిరిసిల్ల జిల్లా; ఫిబ్రవరి 10 (వాయిస్ టుడే) : రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేటలో అతిరుద్ర మహా యాగం లొ భాగంగా కాశీ విశ్వనాథ మందిర్ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ జోషి ఆధ్వర్యంలో అభిషేకం నిర్వహించగా వేములవాడ శాసన సభ్యులు ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ పాల్గొన్నారు.అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్వామి వారి ఆశీస్సులతో లోక కళ్యాణం జరగాలని ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని ఎలాంటి ఆటంకాలు లేకుండా రాజన్న ఆలయ విస్తీర్ణ, అభివృద్ధి పనులు జరగాలని స్వామివారిని వేడుకున్నారు.



## 'వాయిస్ టుడే' క్యాలెండర్ ఆవిష్కరణ

### ఆవిష్కరించిన కొనరావుపేట తహశీల్దార్

కొనరావుపేట, ఫిబ్రవరి 10 (వాయిస్ టుడే ): రాజన్న సిరిసిల్ల జిల్లా కొనరావుపేట మండల కేంద్రంలో మంగళవారం "వాయిస్ టుడే" న్యూస్ పేపర్ నూతన క్యాలెండర్‌ను స్థానిక తహశీల్దార్ (ఎమ్మార్వో) గారు ఆవిష్కరించారు. తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన క్యాలెండర్‌ను విడుదల చేసి పత్రిక బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో వరలక్ష్మి గారు మాట్లాడుతూ.. సమాజంలో పత్రికలు కీలక పాత్ర పోషిస్తాయని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడంలో "వాయిస్ టుడే" కృషి చేయాలని అన్నారు. నిరంతరం ప్రజల పక్షాన ఉంటూ, పారదర్శకమైన వార్తలను అందించాలని ఆయన ఆకాంక్షించారు.

## మున్సిపల్ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

**కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్, చొప్పదండి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల పరిశీలన**



కరీంనగర్,ఫిబ్రవరి 10(వాయిస్ టుడే): జిల్లాలో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్, చొప్పదండి,జమ్మికుంట, హుజూరాబాద్ మున్సిపాలిటీలకు నిర్వహించనున్న ఎన్నికలను సమర్థ వంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు.2వ మున్సిపల్ సాధారణ ఎన్నికలు–2026లో భాగంగా కరీంనగర్ జిల్లాలో పోలింగ్ జరగనున్న కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను ఎస్ ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేశారు. అదేవిధంగా చొప్పదండి మున్సిపాలిటీకి సంబంధించిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను చొప్పదండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు.డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లోని ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లనున్న ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు.ఎన్నికల సామాగ్రిని చెక్ లిస్ట్ ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేసుకోవాలని తెలిపారు.ఏవైనా సమస్యలు ఉంటే రూట్,మానిటరింగ్ అధికారులకు తెలియజేయాలని సూచించారు.ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను పాటిస్తూ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల సామాగ్రితో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాహనాల్లోనే పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని, అధికారులు సూచించిన చోటే బస చేయాలని ఆదేశించారు. చొప్పదండిలో పోలింగ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు.నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఓటర్లు స్వేచ్ఛగా ప్రశాంతమైన వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు.



## ప్రతి బ్యాంకు ఖాతాదారు కేవై సి సమర్పించాలి

### కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, ఫిబ్రవరి 10 (వాయిస్ టుడే):ఫైనాన్షియల్ లిటరసీ వీక్––2026 పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆవిష్కరించారు.ఫైనాన్షియల్ లిటరసీ వీక్ 2026 కార్యక్రమాలు 09-02-2026 నుండి 13-02-2026 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ప్రతి బ్యాంకు ఖాతాదారు తమ కేవైసీ వివరాలను సకాలంలో అప్‌డేట్ చేయడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. కేవైసీ అప్‌డేషన్ ద్వారా బ్యాంకింగ్ లావాదేవీలు సురక్షితంగా ఉంటాయని, ప్రభుత్వ పథకాల లబ్ధి సక్రమంగా అందుతుందని తెలిపారు.అందువల్ల కరీంనగర్ జిల్లాలోని అన్ని బ్యాంకు ఖాతాదారులు తమ సమీప బ్యాంకు శాఖను వెంటనే సందర్శించి కేవైసీ అప్‌డేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఫైనాన్షియల్ లిటరసీ వీక్ కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా గ్రామ సభలు, అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు మరియు ఇతర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

# వేములవాడలో మున్సిపల్ ఎన్నికలకు 800 పోలీస్ సిబ్బందితో పటిష్ట భద్రత ఏర్పాట్లు

**పోలింగ్ పూర్తి అయ్యేవరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి**

**స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలి**

**ఎన్నికలు జరిగే మున్సిపాలిటీలలో 163 BNSS (144 సెక్షన్ అమలు).**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే. ఐపీఎస్**



రాజన్న సిరిసిల్ల జిల్లా; ఫిబ్రవరి 10 (వాయిస్ టుడే): సిరిసిల్ల,వేములవాడ మున్సిపల్ పరిధిలో జరుగు ఎన్నికల నేపథ్యంలో ప్రజలు స్వేచ్ఛయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునెల, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా 800 మంది పోలీస్ సిబ్బంది తో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. మంగళ వారం సిరిసిల్ల, వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్లలో ఎన్నికల విధులు నిర్వహించే పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఎన్నికల విధులపై జిల్లా ఎస్పీ దిశ నిర్దేశం చేశారు. ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు సిరిసిల్ల వేములవాడ మున్సిపాలిటీల పరిధి లో రూట్ మొబైల్స్: 17 జోనల్ టీమ్స్ : 06 (ఇన్స్పెక్టర్ స్థాయి అధికారితో), రిసర్వ్ టీమ్స్ : 04 ,స్ట్రయికింగ్ ఫోర్స్ : 02 , స్పెషల్ స్ట్రయికింగ్ ఫోర్స్ : 02 , ఏర్పాటు చేసి మొత్తం 800 మంది పోలీస్ సిబ్బంది ని వినియోగిస్తున్నా మన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ఎట్టి పరిస్థితుల్లో నూ పోలింగ్ కేంద్రాలను వదిలి వెళ్లరాదని రూట్ మొబైల్ అధికారులు తమకు కేటాయించిన రూట్ల లో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని, పోలింగ్ కేంద్రాల వద్ద, రూట్లలో ఎన్నికల ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించే చిన్న సంఘటన ఎదురైన వెంటనే సంబంధిత ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు.పోలింగ్ కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, మందుగుండు సామగ్రి, ఇంక్ బాటిళ్లు, వాటర్ బాటిళ్లు తీసుకువెళ్లడం నిషేధమని, పోలింగ్ బూత్‌లో సెల్ఫీలు దిగడంపై పూర్తిగా నిషేధం ఉంటుందని తెలిపారు. ఎన్నికలు జరిగే మున్సిపాలిటీలలో 163 దీఛీూా (144 సెక్షన్) అమలులో ఉంటుందని, ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున ఆంక్షలను ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాలని, ఎన్నికల నియమాలను అతిక్రమిస్తే చట్టపరమైన తీసుకుంటామని తెలిపారు. ప్రజాస్వామ్య ప్రక్రియ సజావుగా సాగాలంటే నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరికీ బాధ్యత అన్నారు. ఎస్పీ వెంట వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ నాగేంద్రచారి ఇన్స్పెక్టర్ లు, ఆర్.ఐ లు, ఎస్.ఐ లు , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఓటే మన వజ్రాయుధం

### డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్

కరీంనగర్,ఫిబ్రవరి 10(వాయిస్ టుడే): స్థానిక వివేకానంద డిగ్రీ మరియు పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నేను తప్పక ఓటు వేస్తాను,మీరు కూడా వేయండి కానీ ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా,నీ ఓటే ఒక ప్రశ్నించే గొంతుక కావాలి అనే నినాదంతో ముద్రించిన వాల్ పోస్టర్ ను ఆవిష్కరించి విద్యార్థులచే ఓటర్ ప్రతిజ్ఞను నిర్వహించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్ తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగం మనకు కల్పించినటువంటి వజ్రాయుధం ఓటు.ఆ ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకుని నీతి నిజాయితీగా,సుపరిపాలన అందించే నాయకున్ని ఎన్నుకోవాలని, జరగబోయే మున్సిపల్ ఎన్నికలలో మీ ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలి అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఏ సి ఓ బి సంపత్ కుమార్ ఏవో బి శ్రవణ్ కుమార్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ధనపురి సాగర్, బైరం మహేష్ ,నాంపల్లి శ్రీనివాస్ అధ్యాపకులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

వాయిస్ టుడే
జనగాత్రం - మననేత్రం
హైదరాబాద్
బుధవారం 11 ఫిబ్రవరి 2026



## మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

**– ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ**

హుజూరాబాద్ ఫిబ్రవరి 10 (వాయిస్ టుడే): హుజురాబాద్ మున్సిపల్ పరిధిలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను కరీంనగర్ జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా హుజరాబాద్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఎన్నికల కేంద్రంలో ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రం, స్ట్రాంగ్ రూములు మరియు ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఇబ్బంది కలగకుండా త్రాగునీరు కల్పించాలని, ఓటర్లకు చలువ పందిల్లు ఏర్పాటు చేయాలని సూచించారు. స్ట్రాంగ్ రూముల వద్ద కట్టు దిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని, సీసీ కెమెరాల నిఘా నిరంతరం ఉండాలని, ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేసి ఎన్నికలు ముగిసేలా చూడాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఆర్డీవో రమేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాద్ హైమద్, తహసీల్దార్ జక్కని నరేందర్ పాల్గొన్నారు.



## బాలికల సాధికారత వికాసమే ప్రధాన లక్ష్యం

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 10 (వాయిస్ టుడే):కొత్తపల్లి మండలం ఎలగందల్ లోని పీఎంశ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఈ నెల 2వ తేదీనుండి 10వ తేదీ వరకు వాయిస్ ఫర్ గర్ల్స్ సంస్థ ఆధ్వర్యంలో రెండవ దశ అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమంలో భాగంగా బాలికలహక్కులు భద్రత సమానత్వం అన్న అంశాలపై అవగాహన కల్పించడమే కాక సమాజంలో బాలికలకు ఎదురయ్యే వివిధ సమస్యల నుండి తమను తాము రక్షించుకుంటూ భవిష్యత్తును రూపొందించుకునే విధంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా 'వాయిస్ ఫర్ గర్ల్స్' సంస్థ పనిచేస్తుందని కో ఆర్డినేటర్ మానస తెలిపారు.ఈ సందర్భంగా బాలికల సాధికారత వికాసం కోసం సంస్థ చేస్తున్న కృషిని ప్రిన్సిపల్ కొడిమ్యాల శ్రీనివాస్ అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కొడిమ్యాల శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు,సంస్థ ఫీల్డ్ కోఆర్డినేటర్ మానస, కౌన్సిలర్లు ప్రియాంక,నందిని, శ్రీవాణి,సిరి అంజు,ఫాతిమ, పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ డీఏలు, రిటైర్డ్ ఉద్యోగుల బెన్ ఫిట్స్,పీఆర్సీ బకాయిలు తక్షణమే చెల్లించాలి

**ముఖ్యమంత్రికి లేఖ రాసిన బండి సంజయ్ కుమార్**



కరీంనగర్, ఫిబ్రవరి 10(వాయిస్ టుడే):తెలంగాణలోని లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగుల,ఉపాధ్యాయుల, రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ లో ఉన్న గ్రాట్యుటీ,ఈపీఎఫ్, లీవ్ ఎన్ క్యాష్ మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని కేంద్ర హోం సహాయ శాఖ మంత్రి బండి సంజయ్ కుమార్ ముఖ్యమంత్రికి లేఖ రాశారు.ఆయన లేఖలో 2023 జులై నుండి అమలు చేయాల్సిన పీఆర్సీని రెండున్నరేళ్లు అవుతున్నా ఆ ఊసే ఎత్తకపోవడం శోచనీయం. కనీసం పీఆర్సీ రిపోర్ట్ ను కూడా తెప్పించకపోవడం చూస్తుంటే రాష్ట్ర ప్రభుత్వానికి ఉద్యోగులంటే ఎంతటి నిర్లక్ష్య వైఖరి ఉందో అర్ధం చేసుకోవచ్చు.ఇంకా బాధాకరమైన విషయం ఏమిటంటే.జీవితాంతం ప్రభుత్వానికి సేవ చేసి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు ఇవ్వాల్సిన సొమ్మును కూడా ప్రభుత్వం చెల్లించడం లేదు.2024 నుండి నేటి వరకు దాదాపు13 వేల మంది ఉద్యోగులు రిటైర్డ్ అయ్యారు. ఆనాటి నుండి నేటి వరకు వారికి రావాల్సిన బెన్ ఫిట్స్, 5 డీఏలు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బంది పెట్టడం ఎంతవరకు న్యాయం? తమ పిల్లలకు పెళ్లిళ్లు చేయడం కోసం,ఉన్నత చదవులు చదివించడం కోసం దాచుకున్న సొమ్మును చెల్లించకపోవడంతో వారంతా తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు.జీవిత మలి సంధ్యలో ప్రశాంతమైన జీవితాన్ని గడపాల్సిన రిటైర్డ్ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వమే మానసిక వేదనకు గురిచేస్తుండటం క్షమించరానిది. ముక్కు మొఖం తెలియని వృద్దులు కష్టాల్లో ఉంటేనే చేతనైనంత సాయం చేయాలని భావించే గొప్ప మానవతా హృదయమున్న తెలంగాణ సమాజం మనది.అట్లాంటిది జీవితాంతం ప్రభుత్వానికి ఊడిగం చేసిన ఉద్యోగులు రిటైర్డ్ అయితే వారిని బెన్ ఫిట్స్ అన్నీ చెల్లించి సగౌరవంగా సన్మానించి పంపాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ వారి ఉసురు పోసుకోవడం అత్యంత శోచనీయం.మానవత్వం ఉన్న పాలకులెవరూ ఇంతటి నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శించరు.మీ నిర్లక్ష్యంవల్ల బెన్ ఫిట్స్ అందక గత ఏడాది నుండి ఇప్పటి వరకు 61 మంది రిటైర్డ్ ఉద్యోగులు తీవ్ర మానసిక వేదనకు లోనై మరణించారు.ఈ చావులకు రాష్ట్ర ప్రభుత్వం కారణం కాదా? వారిపై ఆధారపడిన కుటుంబాలకు మీరేం సమాధానం చెబుతారు? ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులపట్ల పాలకులు ఇంతటి కర్కశంగా వ్యవహరించడం తెలంగాణకు మాయని మచ్చ తెస్తుందనే విషయం మరిచిపోయారా?రిటైర్డ్ ఉద్యోగులతోపాటు ఉద్యోగ, ఉపాధ్యాయలకు చెల్లించాల్సిన బకాయిలన్నీ కలిపితే రూ.12 వేల కోట్లకుపైగా ఉన్నట్లు తెలుస్తోంది. ఏటా రూ.2.5 కోట్లకు పైగా వార్షిక బడ్జెట్ కలిగిన రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు రూ.12వేల కోట్ల బకాయిలు చెల్లించడం భారంగా భావించడం అంటే...అంతకంటే దురదృష్టకరమైన విషయం ఇంకోటి లేదు.ప్రభుత్వ ఉద్యోగులు,రిటైర్డ్ ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వం దృష్టిలో ప్రాధాన్యత లేని కేటగిరీగా భావిస్తున్నట్లు కన్పిస్తోంది. ఇలాంటి ఆలోచన కలిగి ఉండటం రాష్ట్ర ప్రభుత్వానికి,తెలంగాణ పురోభివృద్ధికి గొడ్డలిపెట్టుగా మారుతుంది.ఇకనైనా వారిపట్ల మీకున్న నిర్లక్ష్య ధోరణిని విడనాడి బకాయిలన్నీ చెల్లించాలని కోరుతున్నాం.ముఖ్యంగా రిటైర్డ్ ఉద్యోగుల బెన్ ఫిట్స్ బకాయిలను అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకుని యుద్ద ప్రాతిపదికన చెల్లించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. లేనిపక్షంలో మున్సిపల్ ఎన్నికల అనంతరం రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ,రిటైర్డ్ ఉద్యోగుల పక్షాన భారతీయ జనతా పార్టీ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేసేందుకూ వెనుకాడబోమని తెలియజేస్తున్నాం. అవసరమైతే హైదరాబాద్ నడిబొడ్డున ఆయా ఉద్యోగుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చే వరకు దీక్ష చేసేందుకు తగిన కార్యాచరణను రూపొందించుకునేందుకు వెనుకంజ వేసే ప్రసక్తే లేదని తెలియజేస్తున్నాం అన్నారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి

**ఫిబ్రవరి 12న కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు డివైఎఫ్ఐ సంపూర్ణ మద్దతు**

**డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్**




కరీంనగర్,ఫిబ్రవరి 10(వాయిస్ టుడే):కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించాలని,కేంద్ర ప్రభుత్వ కార్మికవర్గ వ్యతిరేక, యువజన వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న కేంద్ర కార్మిక సంఘాలు,ప్రజా సంఘాలు నిర్వహిస్తున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య ( డివైఎఫ్ఐ)తెలంగాణ రాష్ట్ర కమిటీ సంపూర్ణ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని సమ్మెలో యువత భాగస్వామ్యం కావాలని డివైఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ పిలుపునిచ్చారు.కరీంనగర్ జిల్లా కేంద్రంలో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య( డివైఎఫ్ఐ) జిల్లా 6వ మహాసభ వాగేశ్వరి కాలేజీలో నిర్వహించారు.ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించకుండా ప్రభుత్వ రంగ సంస్థలు అన్నింటిని ప్రైవేటీకరణ చేస్తూ ఉన్న ఉద్యోగాలను తీసివేస్తూ నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తూ కార్పొరేట్లకు, పెట్టుబడుదారులకు అనుకూలంగా పనిచేస్తుందన్నారు.

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు నిర్వహిస్తున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో డివైఎఫ్ఐ భాగస్వామ్యం అవుతుందని అన్నారు.దేశంలో నిరుద్యోగం ఆందోళనకర స్థాయికి చేరిన తరుణంలో,తగిన ఉపాధి అవకాశాలను కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు.ఆర్భాటమే తప్ప నిరుద్యోగులకు చేసిందేమీ లేదు.కొత్త ఉద్యోగాలు సృష్టించకపోగా ఉన్న ఉద్యోగాలు ఊడిపోయి కోట్లాదిమంది నిరుద్యోగులు రోడ్డున పడ్డ పరిస్థితి బిజెపి ప్రభుత్వంలో ఉందన్నారు.నేడు వందల పోస్టులకు వేలల్లోనూ,వేల పోస్టులకు లక్షల్లో దరఖాస్తులు చేసుకుంటున్న తీరు దేశంలో నిరుద్యోగ పెరుగుదలకు నిదర్శనం అన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చింది.కానీ ఇప్పటివరకు కేవలం గత ప్రభుత్వ నోటిఫికేషన్లతో కలిపి 55 వేల ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేసింది. ఇంకా 1,45,000 ఉద్యోగాలను భర్తీ చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పైన ఉందన్నారు.అదేవిధంగా జాబ్ క్యాలెండర్ను నామమాత్రంగా ప్రకటించి అమలు చేయడం లేదన్నారు.నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించకుండా కాలయాపన చేస్తూ నిరుద్యోగులను మోసం చేస్తుందన్నారు.స్పష్టమైన జాబ్ క్యాలెండర్ ని ప్రకటించి అమలు చేయాలని,తక్షణమే ఉద్యోగాల భర్తీకై నోటిఫికేషన్స్ వేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేంతవరకు నిరుద్యోగ యువతకు ప్రతి ఒక్కరికి 4000/ నిరుద్యోగ భృతిని ఇస్తామని చెప్పి గత బడ్జెట్లో నిధులు కేటాయించకుండా అసలు నిరుద్యోగ భృతి అనే పేరు ప్రస్తావించకుండా నిరుద్యోగులను నిర్లక్ష్యం చేస్తుందన్నారు. అనేక ఆశలతో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చిన నిరుద్యోగులను నేడు రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా కాలం వెళ్లదీస్తుందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం స్వయం ఉపాధి రుణాలకై రాజీవ్ యువ వికాస్ పథకాన్ని అమలు చేయకుండా,నిధులు మంజూరు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు.ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రాజీవ్ యువ వికాస పథకాన్నిఅమలు చేయాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల్లో భాగంగా యూత్ డిక్లరేషన్ హామీల న్నింటిని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్లో యువతకు నిరుద్యోగ భృతి కి,రాజీవ్ యువ వికాస్ పథకానికి,యూత్ డిక్లరేషన్ హామీల అమలుకు తగినన్ని నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనియెడల డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలకై ఉద్యమిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేష్,ఉపాధ్యక్షుడు సురేష్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో జిల్లా కార్యదర్శి తిరుపతి నాయక్ జిల్లా నాయకులు, భాస్కర్ రాజుకుమార్,శివ ,అశోక్ , అరవింద్ ,చరణ్ పాల్గొన్నారు.

## ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ

జమ్మికుంట ఫిబ్రవరి 10 (వాయిస్ టుడే): జమ్మికుంట మున్సిపల్ పరిధిలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను కరీంనగర్ జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జమ్మికుంట లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన ఎన్నికల కేంద్రంలో ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రం, స్ట్రాంగ్ రూములు మరియు ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఇబ్బంది కలగకుండా త్రాగునీరు కల్పించాలని, ఓటర్లకు చలువ పందిల్లు ఏర్పాటు చేయాలని సూచించారు. స్ట్రాంగ్ రూముల వద్ద కట్టు దిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని, సీసీ కెమెరాల నిఘా నిరంతరం ఉండాలని, ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేసి ఎన్నికలు ముగిసేలా చూడాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఆర్డీవో రమేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్, తహసీల్దార్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.



## బి వి పి ఆధ్వర్యంలో వందే మాతరం 150 వ జయంతి ఉత్సవాలు

హన్మకొండ( వాయిస్ టుడే ) ఫిబ్రవరి 10 : వందేమాతరం 150 ఉత్సవాల్లో భాగంగా భారత్ వికాస్ పరిషత్ ( బి వి పి ) ఓరుగల్లు శాఖ ఆధ్వర్యంలో హనుమకొండ కే యల్ యన్ రెడ్డి కాలనీ లోని డిపడైల్ హై స్కూల్ లో మంగళవారం విద్యార్థులకు మల్టీకలర్ లో ముద్రించిన క్యాలెండర్లను పంపిణీ చేశారు. జాతీయ నాయకులతో పాటు, వందే మాతరం పూర్తి పాఠం ముద్రించిన పోస్టర్ల పంపిణీ కార్యక్రమంలో బీవీపీ కార్యదర్శి కే సత్యనారాయణ పాల్గొని మాట్లాడుతూ, వందేమాతరం పాట స్ఫూర్తి తోనే స్వాతంత్రం సంపాదించుకున్నామని అన్నారు. ఎంతోమంది హృదయాలలో దేశభక్తిని ప్రేరేపించిన గేయం వందేమాతరం అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వి సీ రామారావు, బీవీపీ బాధ్యులు స్నిగ్ధ పాల్గొన్నారు. అనంతరం క్యాలెండర్లను అనుమకొండలోని ఆక్స్ఫర్డ్ హై స్కూల్, విశ్వశాంతి హై స్కూల్,(కడిపి కొండ ) అక్షర వెస్లీ,మేధ,(కాజిపేట్ ) హై స్కూల్ల తో పాటు కాకతీయ హై స్కూల్ (సుబేదారి ) విద్యార్థులందరికీ పంపిణీ చేశారు. డివిపి అధ్యక్షులు డాక్టర్ సుధీర్ కుమార్ పర్యవేక్షణ జరిగిన ఈ కార్యక్రమంలో బి వెంక రెడ్డి వివేకానంద తోపాటు ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు వెంకటరమణ,సంపత్ రెడ్డి, నవీన్ రెడ్డి, రామచంద్ర మూర్తి, మధుకర్ రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజానాయకుడు జంగా రాఘవరెడ్డి

### ఘనంగా జంగా జన్మదిన వేడుకలు

కాజీపేట (వాయిస్ టుడే) : ప్రజానాయకుడు ప్రజలకు ఏ కష్టం వచ్చినా నేనున్నానని ఆదుకునే నాయకుడు తెలంగాణ ఆయిల్ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అని 47వ డివిజన్ కాంటెస్ట్ కార్పొరేటర్ సందెల విజయ్ కుమార్ తెలిపారు. మంగళవారం జంగా జన్మదినం సందర్భంగా టేకులగూడెం లోని రాఘవరెడ్డి ఫామ్ హౌస్ లో విజయ్ కుమార్ జంగాను మర్యాదపూర్వకంగా కలసి శాలువా కప్పి,బొకే అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జంగా కార్యకర్తలు,అభిమానులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రావుల విద్యాసాగర్,కాసర్ల నాగేష్, సత్యవరం మధుకర్, గంగుల రాజి రెడ్డి,అశోక్,సురేందర్,దేవర రమేష్,సమ్మయ్య,మాచర్ల శేఖర్,విక్రాంత్,చింటూ,అఖిల్,రంజిత్,మున్నా తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కాజిపేట్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాజీపేట చౌరస్తాలో మంగళవారం ఉదయం బోయిని కుమార్ యాదవ్,గుర్రపు కోటేశ్వర్ అధ్యక్షతన చైర్మన్ జంగా రాఘవరెడ్డి జన్మదినం ఘనంగా నిర్వహించి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,జంగా అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణం కూల్చివేయాలి..

**రోడ్డు ఆక్రమణదారులకు అధికారుల ఆదేశాలు..**

కాజీపేట (వాయిస్ టుడే) : మండలంలోని 46 వ డివిజన్ మడికొండ ఎస్సీ కాలనీలో గల మహిళా కమ్యూనిటీ హాల్ ప్రక్కన ఉన్న రోడ్డు భాగాన్ని కబ్జా చేసి అభివృద్ధికి అడ్డుపడుతున్న వారిపై స్థానిక జాంబవ సంఘం అధ్యక్షుడు వస్కుల ఆనందం,కాలనీవాసులు సోమవారం ప్రజావాణిలో మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం కమిషనర్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ సిటీ ప్లానర్ నస్రీన్ బాను,టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సి.హెచ్ వెంకటరమణ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆక్రమించిన రోడ్డు స్థలాన్ని మూడు రోజుల్లో వెంటనే కూల్చివేసి అభివృద్ధికి తోడ్పడాలని.. ఆక్రమించిన వారికి ఆదేశాలు జారీ చేశారు. లేనిపక్షంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తామే తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. కాలనీ వాసులు ఎవరు ఆధైర్యపడొద్దని,సమస్యను తక్షణమే పరిష్కరిస్తామని కాలనీవాసులకు అధికారులు ఇచ్చారు. ఈ సందర్భంగా జాంబవ సంఘం అధ్యక్షుడు వస్కుల ఆనందం మాట్లాడుతూ సమస్యపై స్పందించి పరిష్కారం అయ్యేలా, అభివృద్ధికి అడుగుపడేలా సహాయం అందించిన మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్,కాజీపేట ఎమ్మార్వో,జాంబవ సంఘం నాయకులకు, కాలనీవాసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

## భక్తుల తరలింపులో తొర్రూరు డిపో కృషి అభినందనీయం




తొర్రూరు, ఫిబ్రవరి 10 (వాయిస్ టుడే) : మేడారం జాతరకు భక్తులను సురక్షితంగా తొర్రూరు ఆర్టీసీ బస్సులో తరలించడం అభినందనీయమని ఆర్టీసీ ఈడి సాల్మన్ రాజు అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమ్మక్క సారలమ్మ మహా జాతర ను విజయవంతం చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని వరంగల్ ఆర్ఎం విజయ భాను అధ్యక్షతన జడ్ఎస్ టిసి లో జరిగిన మేడారం సక్సెస్ మీట్ లో తొర్రూరు ఆర్టీసీ డిపో మేనేజర్ పద్మావతిని శాలవాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే అతిపెద్ద జాతర అయిన మేడారం సమ్మక్క సారలమ్మ మహాజాతరకు వచ్చే భక్తులను సురక్షితంగా తీసుకువచ్చి అమ్మ వార్ల దర్శనం అనంతరం తమ తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చడంలో టీజేఎస్ఆర్టిసి విజయవంతమైందన్నారు.తొర్రూరు డిపో నుండి సుమారు 100 బస్సు సర్వీస్ లు నడిపి ఏలాంటి బ్రేక్ డౌన్, యాక్సిడెంట్లు లేకుండా డిపోకు అధిక ఈపీకే ను కెఎంపిఎల్ ను తీసుకురావడానికి డిఎం పద్మావతి కృషి అభినందనీయమన్నారు.సంస్థ ఎంత క్లిష్టమైన టాస్కులు ఇచ్చిన కూడా తొర్రూర్ డిపో మేనేజర్ పద్మావతి ముందు వరుసలో ఉండడమే కాకుండా టాస్క్ ను విజయవంతం చేస్తుందని కొనియాడారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం మహేష్, ఎం ఎఫ్ విజయ్ కుమార్, ఎస్టిఐ రజిత రెడ్డి, ఎస్డిఐ, ఏడిసీలు తదితరులు పాల్గొన్నారు.





# కళాశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

**సాంఘిక సంక్షేమ కళాశాల విద్యార్థుల ఆందోళన..**

**జాతీయ రహదారిపై అందోళన, బైఠాయింపు**

**చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారుల హామీ**

**మడికొండ సీఐ చొరవతో శాంతించిన విద్యార్థులు..**

**లీవ్‌లో ఉండాలని ప్రిన్సిపాల్‌కు ఉన్నతాధికారుల ఆదేశం**

కాజీపేట (వాయిస్ టుడే) : తమను ప్రిన్సిపాల్ అకారణంగా,అన్యాయంగా కొడుతోందని.. ఇష్టానుసారంగా బూతులు తిడుతూ ఇబ్బందులకు గురి చేస్తుందని.. తక్షణమే ఆమెను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కాజీపేట మండలం మడికొండలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల,కళాశాల ఇంటర్ విద్యార్థులు ఒక్కసారిగా ఆందోళనకు దిగారు. మెరుపువేగంతో కళాశాల హాస్టల్ నుండి బయటికి వచ్చిన వందలాది మంది విద్యార్థులు పాదయాత్ర ద్వారా జిల్లా కలెక్టర్ ను కలవడానికి వెళ్తుండగా పోలీసులు అడ్డుకోవడంతో వరంగల్–హైదరాబాద్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ సోమవారం ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న 11 మంది విద్యార్థులు 10 నిమిషాలు ఆలస్యంగా క్లాసుకు హాజరయ్యారని..దీంతో గురుకుల బాలికల పాఠశాల,కళాశాల ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వరి ఇష్టానుసారంగా అందరి ముందు నానా బూతులు తిడుతూ తమను చితకబాదిందని విద్యార్థులు వాపోయారు. కులం,మతం పేరుతో ప్రిన్సిపాల్ తమను దుర్భాషలాడుతూ ప్రతిరోజు చిత్రహింసలకు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడపిల్లలు అని కూడా చూడకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. హాస్టల్లో కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని,విషయాన్ని ప్రిన్సిపల్ దృష్టికి తీసుకెళ్తే తమనే తిడుతుందని వారు తెలిపారు. పాఠశాలలో మూత్రశాలలు సరిగ్గా లేవని,తమకు పెట్టే భోజనాన్ని ఇష్టానుసారంగా పెడుతున్నారని,భోజనాన్ని అధ్యాపకులే తింటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్లో కుక్కల బెడద ఉంటుందని,కొద్ది రోజుల క్రితం కుక్కలు దాడి చేయగా కొంతమంది విద్యార్థులకు గాయాలయ్యాయని..విషయం ప్రధానోపాధ్యాయులకు తెలిసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. పాఠశాలలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను బయటవారికి చెబితే కఠిన చర్యలు తీసుకుంటానని బెదిరిస్తూ మానసికంగా హింసిస్తుందని కన్నీటి పర్యంతమయ్యారు.

సోమవారం ప్రిన్సిపాల్ విద్యార్థులను కొట్టడంతో ఎందుకు కొడుతున్నారని అడగడంతో ప్రశ్నించిన విద్యార్థులను దుర్భాషలాడుతూ అందరినీ చితకబాదుతానని బెదిరింపులకు గురిచేస్తూ తాము కళాశాల బయటకు వెళ్లకుండా ప్రధాన ద్వారానికి తాళం వేసి ఇబ్బందులకు గురి చేసిందన్నారు. ప్రధానోపాధ్యాయులు పెడుతున్న ఇబ్బందులు భరించలేక తాము ధైర్యం చేసి రోడ్డు ఎక్కామన్నారు. తమను ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వరుని వెంటనే తొలగించాలని..వారికి సహకరిస్తున్న ఉపాధ్యాయులపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. తమ బాధను ఉన్నతాధికారులకు తెలిపేందుకు ధర్నా చేపట్టామన్నారు. కాగా విద్యార్థులు రోడ్డుపై ధర్నా చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న మడికొండ సీఐ పుల్యాల కిషన్ ఘటనాస్థలానికి చేరుకున్నారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకున్న సీఐ విద్యార్థుల సమస్య పరిష్కారానికి అధికారులతో విద్యార్థులను ఫోన్లో మాట్లాడించారు. అనంతరం గురుకుల సంస్థ జోనల్ అధికారి విద్యార్థులతో వద్దకు చేరుకొని న్యాయం జరిగేలా చూస్తామని, విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చి విద్యార్థులను కళాశాలకు పంపించారు. సీఐ కిషన్ చొరవతో విద్యార్థులు శాంతించి కళాశాలకు వెళ్లిపోయారు. అనంతరం ఉన్నతాధికారులు ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వరిని పాఠశాలకు హాజరుకాకుండా లీవ్ లో ఉండాల్సిందిగా ఆదేశించారు.

**విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం..**

అకారణంగా విద్యార్థులను కొడుతూ బూతులు తిడుతున్నారని సాంఘిక సంక్షేమ కళాశాల ప్రిన్సిపాల్ పై విద్యార్థులు చేస్తున్న ఆరోపణలపై ఉన్నతాధికారులు స్పందించారు. జరిగిన ఘటనపై వారు విచారం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరిని తక్షణమే లీవ్ లోకి పంపించామని.. సత్వరమే విచారణ జరిపించి,నిజ నిజాలను తెలుసుకొని ప్రిన్సిపాల్ పై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు తెలియజేశారు.

# తెలంగాణ గ్రామీణ బ్యాంక్, ముదిగొండ శాఖ ఆధ్వర్యంలో బ్యాంకింగ్ అవగాహన సదస్సు మరియు కళాజాతర



ముదిగొండ మండలం ఫిబ్రవరి 10 వాయిస్ టుడే: నాబార్డ్ (NABARD) సౌజన్యంతో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ముదిగొండ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించేందుకు ముత్తారం గ్రామంలో 'కళాజాతర' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బ్యాంక్ మేనేజర్ జ్ఞాన సుమ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజర్ సుమ మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన (PMJJBY): రూ. 436/- ప్రీమియంతో 200000 బీమా రక్షణ, మరియు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన (PMSBY): కేవలం రూ. 20/- లకే 200000 ప్రమాద బీమా సౌకర్యం,GPI ఇన్సూరెన్స్: రూ. 2000/- ప్రీమియంతో పాలసీ తీసుకున్న వారు ప్రమాదవశాత్తు మరణిస్తే, వారి నామినీకి రూ. 40,00,000/- (నలభై లక్షల రూపాయలు) అందుతుందని వివరించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ, ఖాతాదారులు తాము తీసుకున్న అప్పులను సకాలంలో చెల్లించి వివిధరకములైన రాయితీలను పొందాలని మరియు బ్యాంకుతో సత్సంబంధాలు కలిగి ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ బ్యాంక్ ఖాతాలకు Re-kyc / C-kyc చేయించుకోవాలని కోరారు. సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త: ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి అడిగితే ఓటిపి (ఓటీపీ)లు లేదా వ్యక్తిగత వివరాలు చెప్పకూడదని ప్రజలను అప్రమత్తం చేశారు. కళాకారులు తమ ఆటపాటలతో బ్యాంకింగ్ మోసాలు మరియు పథకాలపై ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా వివరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ భాను ప్రకాష్, బ్యాంకు సిబ్బంది, గ్రామ సర్పంచ్ మమత, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# హక్కుల కాలరాసేందుకే నూతన కార్మిక చట్టాలు

**ఈనెల 12న జరిగే కార్మికుల సమ్మెలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలి**

**ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్**




హనుమకొండ, వాయిస్ టుడే: కేంద్రప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన 4 నూతన కార్మిక చట్టాలను రద్దు చేయాలని తిరిగి 29 పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్,బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ డిమాండ్ చేశారు. భారత రాష్ట్ర సమితి పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయం బాలసముద్రం నందు అన్ని కార్మిక సంఘాలతో కలిసి ఉద్యోగ కార్మిక హక్కుల సాధనలో భాగంగా జాతీయ సార్వత్రిక సమ్మె సన్నాహక సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 11న వేయి స్తంభాల దేవాలయం నుంచి కాజీపేట రైల్వే స్టేషన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 12 గురువారం జరిగే జాతీయ సార్వత్రిక కార్మికుల సమ్మెలో అన్ని సంఘాలు,కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. నూతన కార్మిక చట్టాల కారణంగా కార్మికులు వారి కనీస హక్కులను కోల్పోతున్నారని అన్నారు.

పనికి తగ్గ వేతనం,సెలవులు,నిరసన తెలిపే హక్కులు ప్రశ్నార్థకంగా మారుతున్నాయని వివరించారు. మేనేజ్మెంట్ వారి పరిశ్రమలో పని చేసే ఉద్యోగిని హైర్ అండ్ ఫైర్ విధానంలో తీసుకొనే అవకాశం ఉందని తెలిపారు. కార్మికులు సంఘాలు ఏర్పాటు చేసుకోవడం హక్కుల సాధనకు ఉద్యమిస్తే వారిని తొలగించే ప్రమాదంలో ఉద్యోగులు ఉంటారని.. ఈఎస్ఐ,పీఎఫ్ వంటి కనీస సౌకర్యాలు పొందలేని పరిస్థితి భవిష్యత్‌లో రాబోతోందని ఈ నూతన కార్మిక చట్టాల ద్వారా వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. యూనియన్లను ఏర్పాటు చేసుకునే హక్కును సైతం కోల్పోతారని అన్నారు. కార్మికుల హక్కుల కోసం అన్ని సంఘాలు ఏకమై కేంద్రంపై పోరాడుదామని పిలుపునిచ్చారు. రైతు ఉద్యమమే స్ఫూర్తిగా కార్మికులందరం ఉద్యమిద్దామని సూచించారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు నశించాలన్నారు. జాతీయ సార్వత్రిక సమ్మెకు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తోందని తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న బీఆర్టీయూ హనుమకొండ జిల్లా కన్వీనర్ నాయిని రవి,సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్,ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సారంగపాణి,ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్, ఏఐసీటీయూ జిల్లా అధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు, ఎంఏటీఏడీయూ అధ్యక్షులు ఇసంపల్లి సంజీవ, శ్రీధర్ రెడ్డి, అధ్యక్షులు ఎం.డి ఇస్మాయిల్, టీబీఎన్ఆర్‌కే పి శివకుమార్, భిక్షపతి, రాజు, జీడబ్ల్యూఎంసీ నాయకులు భిక్షపతి,ధర్మరాజు, ప్రతాపరుద్ర ఆటో యూనియన్ నర్సింగ్, హోటల్ యూనియన్ అధ్యక్షులు రఘుబాబు,కార్మిక నాయకులు నారయణ గిరి రాజు,పలు సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

## ప్రసవాల సంఖ్య పెరిగేవిధంగా చర్యలు చేపట్టాలి

**పూర్తిస్థాయి రిపోర్టును సమర్పించాలి**

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**



హనుమకొండ జిల్లా, ( వాయిస్ టుడే) : ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ప్రోగ్రాం అధికారులు,ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్,జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారితో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా పరకాల ఏరియా ఆసుపత్రి,కమలాపూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో గైనకాలజిస్టులు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రసవాల సంఖ్య చాలా తక్కువగా జరుగుతున్నాయని..ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎక్కువగా జరగడానికి గల కారణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వైద్యులు,సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు ప్రోత్సహించాలని అన్నారు. ఆరోగ్య కేంద్రాలలో వైద్యాధికారులు,సంబంధిత సూపరింటెండెంట్లు,గైనకాలజిస్టులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఆరోగ్య మహిళా క్లినిక్ లో పరీక్షించి మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేసిన వారికి తగిన ఫాలోఅప్ సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ వైద్యాధికారులు యాక్షన్ ప్లాన్ షెడ్యూల్ ప్రకారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ నాన్ రెసిడెన్షియల్ స్కూళ్లలో హెల్త్ క్యాంపులు నిర్వహించాలని. ఇప్పటి వరకు నిర్వహించిన క్యాంపుల వివరాలను డిఎంహెచ్ఓ రేపటిలోగా సమర్పించాలని, ఆర్.బి.ఎస్.కే బృందాలు తమ షెడ్యూల్ ప్రకారం స్కూల్స్,అంగన్వాడీ కేంద్రాలలో వైద్య పరీక్షలు నిర్వహించి పూర్తిస్థాయి రిపోర్టును సమర్పించాలన్నారు. 2025 లో జననాలలో అమ్మాయిల సంఖ్య తక్కువగా నమోదైన వేలేరు, శాయంపేట లలో అందుకు కారణాలను విశ్లేషించి దానికి అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎంటీపి కిట్ ల అమ్మకాలకు సంబంధించి తనిఖీలు ఎక్కువగా నిర్వహించి గైనకాలజిస్టుల ప్రిస్క్రిప్షన్ ఆధారంగా అమ్ముతున్నారా, లేదా డ్రగ్ ఇన్స్పెక్టర్ తనిఖీ చేయాలన్నారు. జనవరిలో 37 మెడికల్ షాప్స్ ను తనిఖీ చేసి వివిధ నియమాలను ఉల్లంఘించినందుకు గాను పెనాల్టీలను విధించడం ,వాటి లైసెన్సులను సస్పెండ్ చేయడం జరిగిందని హనుమకొండ డ్రగ్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ తెలియజేశారు.

ఎన్.సి.డి. స్క్రీనింగ్ తక్కువగా చేయడానికి కారణాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో 1,98,000 మంది వలనరబుల్ జనాభా కి గాను 1,82,359 మందికి పరీక్షలు నిర్వహించినట్లు 1170 కొత్తగా టీబీ కేసులు గుర్తించి నట్లు అలాగే 511 న్యూట్రిషన్ కిట్ లు అందించినట్లు డి ఎం హెచ్ ఓ, ప్రోగ్రామ్ అధికారి తెలియజేశారు.ఎస్ ఎన్ సి యు లో అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు. అలాగే అక్కడ మరింత మెరుగైన సేవలు అందించేందుకు కావలసిన ఎక్విప్మెంట్ గురించి డాక్టర్ మానస కలెక్టర్ కు విన్నవించారు. ఈ సమీక్ష సమావేశంలో హనుమకొండ డిఎంహెచ్ఓ డాక్టర్ ఎ.అప్పయ్య,జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ గౌతమ్ చౌహన్,జి.ఎం.హెచ్.ఆర్.ఎం.ఓ డాక్టర్ మంజుల,డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రదీప్ రెడ్డి,జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ హిమబిందు,హనుమకొండ డ్రగ్ ఇన్స్పెక్టర్ జె.కిరణ్ కుమార్,ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ప్రభుదాస్,డాక్టర్ రుబీనా,డాక్టర్ జ్ఞానేశ్వర్,వైద్యాధికారులు, డెమో వి.అశోక్ రెడ్డి,ఎస్ఓజి ప్రసన్నకుమార్,తదితరులు పాల్గొన్నారు.



## నేడు పోలింగ్.. పరకాలలో పోలింగ్‌కు సర్వం సిద్ధం

**హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ స్నేహ శబరీష్**

**పరకాలలో మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ పరిశీలన**

హనుమకొండ (వాయిస్ టుడే) : పురపాలక ఎన్నికలకు సర్వం సిద్ధమైంది.. జిల్లాలోని పరకాల పురపాలక సంఘంలోని 22 వార్డులకు బుధవారం పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. మంగళవారం పరకాల లోని గణపతి ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల సిబ్బందికి పోలింగ్ మెటీరియల్ పంపిణీ కోసం డిస్ట్రిబ్యూషన్,రిసెప్షన్,కౌంటింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద పోలింగ్ మెటీరియల్ తీసుకొని సరి చూసుకుంటున్న ఎన్నికల సిబ్బందితో కలెక్టర్ మాట్లాడారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి ఎంతమంది పిఓలు,ఏపీఓలు ఓపివోలు,మైక్రో అబ్జర్వర్లు హాజరు వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్న కలెక్టర్ అఅంనౌతరం స్ట్రాంగ్ రూం ను పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపునకు చేసిన ఏర్పాట్లను తనిఖీ చేశారు. కౌంటింగ్ సంబంధించిన ఏర్పాట్లను గురించి జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి,పరకాల ఆర్డిఓ డాక్టర్ కన్నం నారాయణ,పరకాల మున్సిపల్ కమిషనర్ అంజయ్య లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ప్రొజెక్టర్ స్క్రీన్ పెట్టాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ పరకాల మున్సిపాలిటీలోని 22 వార్డు స్థానాలకు 44 పోలింగ్ కేంద్రాలలో ప్రశాంతంగా పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. కౌంటింగ్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. పోలింగ్ సామగ్రితో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పరకాల మున్సిపాలిటీ పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది బస్సులలో బయలుదేరి వెళ్లారు.ఈ సందర్భంగా పరకాల తహసిల్దార్ విజయలక్ష్మి,ఎంపీడీవో రవీందర్,టిపిఓ సుష్మ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్



కొత్తగూడెం: మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మంగళవారం పరిశీలించారు. ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని సింగరేణి పాఠశాల ఆవరణలో, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో చేపట్టిన ఏర్పాట్లను కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా, ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ ప్రక్రియలు సజావుగా, ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ సిబ్బందికి బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు తదితర ఎన్నికల సామగ్రి క్రమబద్ధంగా అందేలా చూడాలని ఆదేశించారు. ప్రతి బ్యాలెట్ బండిల్‌పై సీల్, అధికారుల సంతకాలు తప్పనిసరిగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కౌంటర్లు, ఎన్నికల సామగ్రి సరఫరా వ్యవస్థ, రిసెప్షన్ రూమ్ కార్యకలాపాలను కలెక్టర్ పరిశీలించారు. అలాగే, సిబ్బందికి తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు తదితర అన్ని మౌలిక సదుపాయాలు పకడ్బందీగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లు లేదా గందరగోళానికి తావులు లేకుండా, చెక్‌లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని సామగ్రి అందిందా లేదా జాగ్రత్తగా పరిశీలించాలని కలెక్టర్ హెచ్చరించారు. సిబ్బంది నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సకాలంలో చేరేలా పర్యవేక్షించాల్సిన బాధ్యత అధికారులకు అప్పగించారు. అలాగే, పోలింగ్ సామగ్రి, ముఖ్యంగా బ్యాలెట్ పేపర్లను తరలించే సమయంలో సాయుధ పోలీసు బందోబస్తు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఏవైనా సమస్యలు తలెత్తిన సందర్భంలో వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించడానికి అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో సంబంధిత ఎన్నికల అధికారులు, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## స్పర్శ్ కుష్ఠ వ్యాధి అవగాహన పక్షోత్సవ కార్యక్రమం



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఫిబ్రవరి 10 : జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డి ఎంఒ హెచ్ ఓ) డా. తుకారం రాథోడ్ లక్ష్మీదేవిపల్లి మండలం, యేదురుగడ్డలోని హేమచంద్రాపురం కుష్ఠ కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా గాంధీజీ ఫోటో ముందు పుష్పాంజలి ఘటించారు. అనంతరం కుష్ఠ వ్యాధి వల్ల కలిగే వికలాంగతలను నివారించే విధానం, కుష్ఠ రోగుల ఆరోగ్య సంరక్షణ, వ్యాధి సోకే కారణాలు ప్రభుత్వం అందిస్తున్న కుష్ఠ వ్యాధి సేవల గురించి వారికి అవగాహన కల్పించారు. కుష్ఠ రోగులకు సెల్ఫ్ కేర్ కిట్లు, ఎం సి ఆర్ చెప్పుల పండ్లు పంపిణీ చేశారు. ఈ రోజు స్పర్శ్ కుష్ఠ వ్యాధి అవగాహన పక్షోత్సవ కార్యక్రమం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డి ఎంఒ హెచ్ ఓ) డా. తుకారం రాథోడ్ యేదురుగడ్డ ఎస్టీ వినస్ హై స్కూల్‌ను సందర్శించారు. అలాగే సమతుల ఆహారం (బ్యాలెన్స్ డైట్), వ్యక్తిగత పరిశుభ్రత, "ఈట్ రైట్ ఒ డ్రింక్ రైట్," సరైన చేతులు కడుక్కోవడం (సుమన్ కె విధానం) గురించి వివరించారు. రోజువారీ జీవితంలో ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించాలని, అవి ఆరోగ్యానికి హానికరం కావచ్చని సూచించారు. జాతీయ నూలిపురుగుల నివారణ దినోత్సవం (నేషనల్ డి ఓర్మింగ్ డే) గురించి కూడా అవగాహన కల్పించి, కృమినాశక మాత్రలు తీసుకోవడం పిల్లల ఆరోగ్యానికి అవసరమని తెలిపారు. ప్రభుత్వం సంవత్సరానికి రెండుసార్లు అల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేస్తోందని, ప్రతి పిల్లవాడు తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డా. తుకారం రాథోడ్ (డి ఎంఒ హెచ్ ఓ), డా. పుల్లారెడ్డి (విఎో ఎన్ టి ఈ పి ), డా. తేజశ్రీ (పి ఓ సి హెచ్ ఐ), డా. స్వప్న (ఏమో పి హెచ్ సి రేగల్ల), డిపి ఏమో మోహన్, భద్రు పిటి ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. స్పర్శ్ కుష్ఠ వ్యాధి అవగాహన పక్షోత్సవ కార్యక్రమం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డి ఎంఒ హెచ్ ఓ) డా. తుకారం రాథోడ్ లక్ష్మీదేవిపల్లి మండలం, యేదురుగడ్డలోని హేమచంద్రాపురం కుష్ఠ కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా గాంధీజీ ఫోటో ముందు పుష్పాంజలి ఘటించారు. అనంతరం కుష్ఠ వ్యాధి వల్ల కలిగే వికలాంగతలను నివారించే విధానాలు, కుష్ఠ రోగుల ఆరోగ్య సంరక్షణ, వ్యాధి సోకే కారణాలు ప్రభుత్వం అందిస్తున్న కుష్ఠ వ్యాధి సేవల గురించి వివరించారు. కుష్ఠ రోగులకు సెల్ఫ్ కేర్ కిట్లు, ఎం సి అర్ చెప్పులు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ (కుష్ఠ) డా. బి. పుల్లా రెడ్డి, పి ఓ సి హెచ్ ఐ డా. తేజశ్రీ, మెడికల్ ఆఫీసర్ పి ఎస్ సి రేగళ్ల డా. స్వప్న, డి పీఎమ్ఒ మోహన్, జి. భద్రు (లెప్రసీ పిటి), ఆరోగ్య సిబ్బంది, కుష్ఠ రోగులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**పోలింగ్ జరిగే ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు సెలవు.**

**ఓటర్లు స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకోవాలి.**

**జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



భద్రాద్రి కొత్తగూడెం (వాయిస్ టుడే) ఫిబ్రవరి 10: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రేపు నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 106 వార్డులు ఉండగా, 1,85,348 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఇందులో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 60 వార్డులు -- 1,34,775 మంది ఓటర్లు, అశ్వరావుపేట మున్సిపాలిటీ పరిధిలో 22 వార్డులు -- 16,850 మంది ఓటర్లు, ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో 24 వార్డులు -- 33,723 మంది ఓటర్లు ఉన్నట్లు జిల్లా కలెక్టర్ వివరించారు. పోలింగ్ నిర్వహణ కోసం జిల్లాలో మొత్తం 90 పోలింగ్ లొకేషన్లలో 288 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిలో 49 సున్నితమైన పోలింగ్ స్టేషన్లను గుర్తించి ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టామని, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ స్టేషన్లు లేవని చెప్పారు. అయితే, ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 4 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంపులు వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించినట్లు పేర్కొన్నారు.

పోలింగ్ నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామక ప్రక్రియ పూర్తయ్యిందని తెలిపారు. జిల్లాలో మొత్తం 345 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1,036 మంది ఇతర పోలింగ్ అధికారులు (రిజర్వ్‌తో కలిపి) నియమించామని చెప్పారు. అదేవిధంగా 48 మంది రిటర్నింగ్ అధికారులు, 48 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు నియమించామని, కౌంటింగ్ సిబ్బందిని ముందుగానే గుర్తించి అవసరమైన శిక్షణ అందించినట్లు వెల్లడించారు.

కౌంటింగ్ నిర్వహణ కోసం జిల్లాలో మూడు కౌంటింగ్ కేంద్రాలను గుర్తించి నోటిఫై చేసినట్లు తెలిపారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌కు అనుబోస్ ఇంజినీరింగ్ కళాశాల, ఇల్లందు మున్సిపాలిటీకి సింగరేణి కమ్యూనిటీ హాల్ (24 ఏరియా), అశ్వరావుపేట మున్సిపాలిటీకి వ్యవసాయ కళాశాల, అశ్వరావుపేటలో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా ప్రాంగణాల్లో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు కూడా సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

బ్యాలట్ బాక్సులు, బ్యాలట్ పేపర్లు సహా ఎన్నికల సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ పూర్తయ్యిందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియపై పర్యవేక్షణ కోసం ఎంచుకున్న పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకున్నామని తెలిపారు. జిల్లాలో మొత్తం 31 జోనల్ అధికారులు, 8 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 10 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ (ఎస్ఎస్‌టీలు) ఏర్పాటు చేసి నిరంతర నిఘా కొనసాగిస్తున్నామని చెప్పారు. సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ నిబంధనలు అమలులో ఉన్నాయని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రేపు పోలింగ్ జరిగే మున్సిపాలిటీ ప్రాంతాల పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలు, వాణిజ్య సంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని ప్రతి అర్హత కలిగిన ఓటరు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగస్వాములవ్వాలని ఆయన కోరారు. ఎన్నికల నిర్వహణలో ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, అధికార యంత్రాంగం సమన్వయంతో సహకరించి మున్సిపల్ ఎన్నికలను శాంతియుతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు తోడ్పడాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ విజ్ఞప్తి చేశారు.




## బ్యాలెట్ బాక్సుల పంపిణీ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ

**ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి: ఎస్పీ రోహిత్ రాజు**

భద్రాద్రి కొత్తగూడెం (వాయిస్ టుడే) ఫిబ్రవరి 10: జిల్లాలోని కొత్తగూడెం కార్పొరేషన్, ఇల్లందు, అశ్వారావుపేట మున్సిపాలిటీలకు బుధవారం జరగనున్న పోలింగ్ నేపథ్యంలో పటిష్టమైన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు.ఇందులో భాగంగా పాల్వంచలోని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాల నందు ఏర్పాటు చేసిన బ్యాలెట్ బాక్సుల పంపిణీ కేంద్రాలను జిల్లా ఎస్పీ పరిశీలించారు.అక్కడ విధులలో ఉన్న అధికారులు,సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలింగ్ కేంద్రాల వద్ద 1200 మందితో భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.పోలింగ్ కేంద్రాల పరిసరాలలో నిరంతర నిఘా కొరకు ప్రత్యేక బృందాలను నియమించడం జరిగిందన్నారు.ఓట్ల లెక్కింపు కేంద్రమైన పాల్వంచ అనుబోస్ కళాశాల పరిసర ప్రాంతాలను డాగ్స్ స్క్వాడ్,బాంబుస్క్వాడ్ తో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని అన్నారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

## బాధిత కుటుంబానికి సుమారు 5 లక్షల ల ఓసీ అందజేసిన ముధోల్ మాజీ శాసనసభ్యులు శ్రీ జి. విట్టల్ రెడ్డి



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఫిబ్రవరి 10: ముధోల్ మండలంలోని రామ్ టెక్ గ్రామానికి చెందిన హై బాత్ దివికే ఆరోగ్యం బాగాలేక నిమ్స్ ఆస్పత్రిలో చేరడం జరిగింది ఈ విషయాన్ని మన ముధోల్ మాజీ శాసనసభ్యులు శ్రీ జి.విట్టల్ రెడ్డి దృష్టికి తీసుకురాగా మాజీ శాసనసభ్యులు ఈ విషయాన్ని మన గౌరవ ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకువెళ్లి ఈరోజు ప్రభుత్వం తరఫునుండి 5 లక్షల రూపాయలల ఓ సి ని మంజూరు చేయించడం జరిగింది.ల ఓసీ నీ మంజూరు చేసి ఇచ్చినందుకు మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మరియు మన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి గౌరవనీయులు జూపల్లి కృష్ణారావు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన ముధోల్ మాజీ శాసనసభ్యులు జి.విట్టల్ రెడ్డి . ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జై భీమ్, పోశెట్టి, మౌలాఖాన్, సాయినాథ్ మరియు తదితరులు ఉన్నారు.

## బ్యాంక్ సొసైటీ కేవైసీ అప్డేట్ చేసుకోనుటకు అవగహన సదస్సు




ఝురాసంగం ఫిబ్రవరి 10 (వాయిస్ టుడే): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఝురాసంగం సొసైటీ యందు లీడ్ బ్యాంక్ ఆఫిస్ సంగారెడ్డి జిల్లా వారు 2026 భాగంగా బ్యాంకులలో మరియు సొసైటీలో అకౌంట్ కలిగిన సభ్యులు, రైతులు, కేవైసీ – అప్డేట్ చేసుకోని వుంటే సైబర్ నేరగాళ్ళ నుంచి ముప్పు తగుతుందని, అలగే రైతులు, ఆకౌంట్ కలిగి ఉన్న వారు ఆదార్ కార్డ్, పాన్ కార్ట్, భూమి పటాదార్ పాస్ బుక్ జిరాక్స్ తీసుకోని బ్యాంక్, సొసైటీ లలో కేవైసీ – అప్డేట్ చేసుకోగలరని సంగారెడ్డి లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ నర్సింగ్ రావు కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసి బ్యాంక్ మేనేజర్ రాజు, సొసైటీ సెక్రటరీ షైక్ నిసార్ అహ్మద్, సోసైటీ సిబ్బంది రమేష్ చారి, షేక్ సులేమాన్ నవీన్, మన్యారామ్ సింగ్, సాయి క్రిష్ణ, రైతులు సంఘ సభ్యులు, తదితరులు పాల్గోని ఈ యొక్క కార్యక్రమని విజయవంతం చేశారు.



## బాసర మండలంలో రూ.92 లక్షల నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఫిబ్రవరి 10: బాసర మండల కేంద్రంలో రూ.92 లక్షల నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ శంకుస్థాపన చేశారు. మండల కేంద్రంలోని రూ.20 లక్షల నిధులతో డ్రెయిన్ నిర్మాణం, రెండు అంగన్వాడి కేంద్రాల ఏర్పాటు, అలాగే రూ.21 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా గ్రామంలోని ఆలయ ఆవరణలో రూ.7 లక్షల నిధులతో త్రాగునీటి (డ్రింకింగ్ వాటర్) పనులకు భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కిర్గులకే గ్రామంలో పాఠశాల విద్యార్థుల భద్రత దృష్ట్యా రూ.10 లక్షల నిధులతో ప్రహరీ గోడ నిర్మాణానికి, మహిళల సంక్షేమం కోసం రూ.10 లక్షల నిధులతో మహిళా సమైక్య సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నిర్మల్ పోలీస్... మీ పోలీస్



**ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు భైంసా సబ్ డివిజన్ అధికారులతో సమావేశమైన జిల్లా ఎస్పీ**

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఫిబ్రవరి 10 : అధికారులకు మార్గదర్శకం చేసిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ మున్సిపల్ ఎన్నికలు శాంతియుతంగా స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్, ఈరోజు భైంసా సబ్ డివిజన్‌కు చెందిన పోలీసు అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ... ఎన్నికల బందోబస్తు ఏర్పాట్లు, సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు, పోలింగ్ కేంద్రాల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణపై అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, ఎన్నికల నిబంధ నలను కఠినంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు శాఖ పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.

# ఎస్ సి డి డి పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌లో పనిచేస్తున్న వర్కర్లకు వేతనాలు విడుదల చేయాలి

**భారత కార్మిక సంఘాల సమాఖ్య ( ఐ ఫ్ టి యూ) ఆధ్వర్యంలో స్ సి డి డిగారికి సమ్మె నోటీస్**

**17 చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి**

**ఐ ఫ్ టి యూ అధ్యక్షులు సునారికారి రాజేష్**




నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఫిబ్రవరి 10: రాష్ట్రంలో షెడ్యూల్ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్(స్ సి డి డి) పరిధిలో పోస్ట్ మెట్రిక్ హాస్టల్ లో ఔట్సోర్సింగ్/యాక్టివిటీ విధానంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఫిబ్రవరి 17న హైదరాబాద్ కమిషనర్ రేట్ కార్యాలయం ముందు జరిగే కార్యక్రమం గురించి నిర్మల్ జిల్లా షెడ్యూల్ క్యాస్ట్ డెవలప్మెంట్ ఆఫీసర్, లేబర్ ఆఫీసర్ కు షెడ్యూల్ క్యాస్ట్ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఐఫ్‌టియూ) ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఐ ఫ్ టి యూజిల్లా అధ్యక్షులు సునారికారి రాజేష్ మాట్లాడుతూ పోస్ట్ మెట్రిక్ హాస్టల్లో వర్క్ చేస్తున్నా వంట కార్మికులు, స్లీపింగ్ నైట్ వాచ్మెన్ డే వాచ్మెన్ శానిటేషన్ వర్కర్లకు గత 13 నెలలుగా జీతాలు లేక తీవ్రంగా ఆర్థికంగా మానసికంగా కష్టాలు ఎదుర్కొంటు న్నారు. విద్యార్థులకు పరిశుభ్రత భోజనం భద్రత తో అత్యంత కీలకమైన పనులు నిర్విరామంగా నిర్వహిస్తున్నప్పటికీ వీరికి నేటికీ జీతాలు ప్రభుత్వం సకాలంలో చెల్లించకపోవడం వల్ల కుటుంబాన్ని పోషించడానికి ఇబ్బందికరంగా ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం వంట కార్మికులకు జీవో ఎంఎస్ నంబర్ 49 ప్రకారం వేతనాలు నిర్ణయించినప్పటికీ ఆ జీవో పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. పోస్ట్ మెట్రిక్ హాస్టల్లో పనిచేస్తున్న వర్కర్లకు పెండింగ్లో ఉన్న ఉన్న 13 నెలల వేతనాలు వెంటనే విడుదల చేయాలని, జీవో ఎంఎస్ నంబర్ 60 ప్రకారం పూర్తి జీతాలు అమలు చేయాలని, అర్హులైన ఉద్యోగుల పేర్లు ఐఎఫ్ఎమ్ఐఎస్ పోర్టల్ లో నమోదు చేయాలని, ఉద్యోగ భద్రత, ఈ పి ఫ్ ఈ స్ ఐ వంటి చట్టబద్ధ హక్కులు కల్పించాలని, ప్రతి నెల మొదటి వారంలోనే జీతాలు చెల్లించాలని, యాక్టివిటీ పద్ధతిని రద్దుచేసి, కనీసం ఔట్సోర్సింగ్ పద్ధతిని అమలు చేసి, జీవో ఎంఎస్ నెంబర్ 60 ను అమలు చేయాలి. తదితర డిమాండ్లు సాధన కోసం ఈనెల 17 తేదీన హైదరాబాద్ షెడ్యూల్ క్యాస్ట్ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్ స్ సి డి డికమిషనరేట్ కార్యాలయం ముందు జరిగే టోకెన్ సమ్మె ధర్నా కార్యక్రమం విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐ ఫ్ టి యూ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం లింగన్న, షెడ్యూల్ క్యాస్ట్ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్ (స సి డి డి) అవుట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఐ ఫ్ టి యూ నాయకులు జి. రాకేష్, హెచ్. సునీల్, శ్రీకాంత్, పుష్ప, లలిత భాయ్, గంగామణి ,శాంతాబాయి నయనతా తదితరులు పాల్గొన్నారు.



## భారత్ అమెరికా స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలి

**కోరుతూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ, ట్రంపుల దిష్టిబొమ్మ దగ్ధం**

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఫిబ్రవరి 10: ఇటీవల భారత్ అమెరికా కుదుర్చుకున్న స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్మల్ ఆర్డిఓ కార్యాలయం ఎదురుగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ల దిష్టిబొమ్మలు దగ్ధం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షులు బరుకుంట గంగారాం, సుంచుల నారాయణ, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగెల్లి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు. అమెరికాతో భారత్ చేసుకున్న స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ ఒప్పందవలన భారతదేశ రైతులు తీవ్రంగా నష్టపోనున్నారు. ఇప్పటికే రైతులకు పండించిన పంటలకు గిట్టుబాటు ధరల చట్టాన్ని పార్లమెంటులో చట్టం చేయడంలో విఫలమైన నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతుల ఆత్మగౌరవాన్ని రైతుల శ్రమను అమెరికాకు తాకట్టు పెట్టారు. పాల నుండి పత్తి తదితర వాటిని విదేశాల నుండి దిగుమతి చేసుకోవడం వలన ఈ దేశ రైతాంగం గిట్టుబాటు ధరలు కూడా నోచుకోవు. ఇప్పటికే పత్తికి ప్రభుత్వం చెల్లిస్తానన్న మద్దతు ధర లభించని విషయం ప్రజలకు తెలిసిందే. అమెరికాలో రైతంగా నికి 50 శాతం సబ్సిడీ ఆ ప్రభుత్వం చెల్లిస్తున్నది. కానీ భారత ప్రభుత్వం కేవలం మూడు శాతం సబ్సిడీ మాత్రమే ఇచ్చి భారత రైతులను నట్టేట ముంచుతుంది. భారత్ అనుసరించే విధానం ఈ దేశ రైతులకు తీవ్ర నష్టం చేయనుంది. వెంటనే భారత్ అమెరికా స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం రద్దు చేయాలని డిమాండ్ చేయడం జరిగింది.

## నిర్మల్‌లో పోలింగ్ సామాగ్రి పంపిణీ



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఫిబ్రవరి 10 : నిర్మల్ మున్సిపల్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రాలకు అవసరమైన సామాగ్రిని మంగళవారం పంపిణీ చేశారు బ్యాలెట్ యూనిట్లు కంట్రోల్ యూనిట్లు వివి ప్యాట్ లు ఓటర్ల జాబితా తొలితల ఎన్నికల సామాగ్రిని పోలింగ్ సిబ్బందికి అప్పగించారు ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా ప్రశాంత వాతావరణం లో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయమని అధికారులు తెలిపారు.

## ప్రజల సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తా



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఫిబ్రవరి 10 : సోను మండల్ కడ్తాల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మొదటి గ్రామ సభ నిర్వహించారు ఈ సందర్భంగా సర్పంచ్ గుర్రం రామ మాట్లాడుతూ ప్రజలందరి సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని రాజకీయాలకు అతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు ప్రజలు కూడా గ్రామ అభివృద్ధికి సహకరించాలని గ్రామంలో ఉన్న సమస్యలను వార్డు వారి గా అడిగి తెలుసుకున్నారు ఈ సమావేశంలో ఉప సర్పంచ్ పుట్టి అజయ్ కార్యదర్శి సుమాయ తస్విన్ వార్డు సభ్యులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు వెయ్యి మందితో భారీ బందోబస్తు

**మూడు మున్సిపాలిటీ పరిధిలో 80 వార్డులకు, 244 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు**

**48 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, 37 అతి సమస్యాత్మక పోలింగ్ లొకేషన్ల పై ప్రత్యేక దృష్టి**

**శాంతియుత ఎన్నికలే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం**

**ఎన్నికల విధుల గురించి పోలీసు అధికారులకు, సిబ్బందికి దిశా నిర్దేశం చేసిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్**




నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఫిబ్రవరి 10 : మున్సిపల్ ఎన్నికలను శాంతియుతంగా పారదర్శకంగా నిర్వహించడమే ప్రధాన లక్ష్యంగా నిర్మల్ జిల్లా పోలీస్ శాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టిందని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ మాట్లాడుతూ... మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సుమారు వెయ్యి మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా భైంసా, నిర్మల్ పట్టణంలో పోలీసు ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీస్ అధికారులు, సిబ్బందికి మార్గదర్శకం చేశారు.ఎన్నికల ప్రక్రియ మొత్తం ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేందుకు పోలీస్ శాఖ అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని మూడు మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 80 వార్డులకు 244 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ తెలిపారు.ఈ ఎన్నికల సందర్భంగా 48 సమస్యాత్మక పోలింగ్ లొకేషన్లు,37 అతి సమస్యాత్మక పోలింగ్ లొకేషన్లపై ప్రత్యేక దృష్టి సారించి పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాలు, మొబైల్ పెట్రోలింగ్, క్విక్ రెస్పాన్స్ టీమ్స్ ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని వెల్లడించారు.

ఎన్నికల నేపథ్యంలో సీఆర్‌పీసీ 144 సెక్షన్ అమల్లో ఉందని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ హెచ్చరించారు. పోలింగ్ రోజు అక్రమ మద్యం, డబ్బు పంపిణీ, ప్రలోభాలు, బెదిరింపులు వంటి వాటిపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ సెంటర్లు, ప్రధాన రహదారులు మరియు సమస్యాత్మక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా వచ్చే ఫుటేజ్‌ను కంట్రోల్ రూమ్ నుంచి 24ఐ7 పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా అనుమానాస్పద కదలికలు కనిపిస్తే వెంటనే స్పందించేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ఇప్పటికే ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహిస్తూ ప్రజల్లో భద్రతా భావన పెంచుతున్నామని తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది అందరూ అప్రమత్తంగా విధులు నిర్వర్తిస్తూ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు నిరంతరం అందుబాటులో ఉంటారని స్పష్టం చేశారు. “ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఏవైనా అనుమానాస్పద ఘటనలు, నిబంధనల ఉల్లంఘనలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. శాంతియుత ఎన్నికల నిర్వహణలో ప్రజల సహకారం అత్యంత కీలకం అని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ విజ్ఞప్తి చేశారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

**- ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తు**

**- సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్**



సంగారెడ్డి జిల్లా (వాయిస్ టుడే ప్రతినిధి) : ఈ నెల 11వ తేదీన సంగారెడ్డి జిల్లాలోని 8 మున్సిపాలిటీల్లో జరగనున్న మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్ తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా సుమారు 1100 మంది పోలీసు సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదనపు ఎస్పీలు, డీఎస్పీల ఆధ్వర్యంలో ప్రత్యేక స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నాయని తెలిపారు. జిల్లా ప్రజలంతా ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పనిసరిగా పాటించాలని, మున్సిపాలిటీల్లో ఎన్నికల కోడ్‌ను కఠినంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని 8 మున్సిపాలిటీల పరిధిలో 199 వార్డులకు గాను 153 కేంద్రాల్లో 453 పోలింగ్ స్టేషన్లలో ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. వీటిలో 59 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించామని పేర్కొన్నారు. పోలింగ్ రోజు ఎన్నికల సరళిని పర్యవేక్షించేందుకు జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రత్యేక ఎలక్షన్ సెల్ ఏర్పాటు చేశామని, బందోబస్తు నిర్వహణ నుంచి ఎన్నికల సామగ్రి, ఎన్నికల సిబ్బందికి భద్రత కల్పించే ప్రతి అంశాన్ని ప్రణాళికాబద్ధంగా పర్యవేక్షిస్తున్నామని అన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, జిల్లా పోలీస్ కార్యాలయం నుంచే నిరంతర పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం సీసీ కెమెరాల నిఘాలో కొనసాగుతుందన్నారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు..**

నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేసి, అభ్యర్థిత్వం కూడా రద్దయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. ఫలితాలు వెలువడే వరకు ‘సైలెన్స్ డే’గా అమలు చేస్తామని, ఈ సమయంలో స్థానికేతరులు కాలనీలు, వార్డుల్లో సంచరించరాదని సూచించారు. ఓటర్ల మనసు గెలిచి ఎన్నికల్లో గెలవాలని, డబ్బు, మద్యం, బహుమతులు, ఉచితాల ద్వారా ప్రలోభాలకు గురిచేయొద్దని తెలిపారు. అలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడినవారు, సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న వ్యక్తులను గుర్తించి ముందస్తుగా 123 కేసులు నమోదు చేసి, 208 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఎన్నికలను ప్రభావితం చేసే అక్రమ మద్యం రవాణాపై 30 కేసులు నమోదు చేసి, రూ. 1.57 లక్షల విలువైన 249 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ వెల్లడించారు.



## ప్రకృతి యాత్ర బృందంచే సైన్స్‌పై అవగాహన కార్యక్రమం

**నాగార్జునసాగర్ బీసీ గురుకులంలో**

**ముఖ్యఅతిథిగా కవి జయరాజ్**

నాగార్జునసాగర్ ఫిబ్రవరి 10 (వాయిస్ టుడే ప్రతినిధి) : నాగార్జునసాగర్ బిసి గురుకులంలో ప్రకృతి వైజ్ఞానిక బృందం ఆధ్వర్యంలో సైన్స్ పై విద్యార్థులకు అవగాహన సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రిన్సిపాల్ రవికుమార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కవి జయరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలని మూఢనమ్మకాలను నమ్మొద్దన్నారు. ప్రకృతిని కాపాడాలని ప్రకృతిని కాపాడితే అది మనల్ని కాపాడుతుందని అన్నారు. రమేష్, విజయ్ లు మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్రం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విద్యార్థులతో వైజ్ఞానిక శాస్త్రం పై చర్చ గోష్టి నిర్వహించి ఏ విధంగా ఉన్నత స్థాయికి చేరొచ్చు విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా అమ్మ అవయవ దాన సమస్త ఫౌండర్ ప్రెసిడెంట్ గంజి ఈశ్వర్ లింగం మాట్లాడుతూ అవయవ ధానాల యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక బాధ్యురాలు స్వరాజ్యలక్ష్మి, వేనేపల్లి పాండురంగారావు, ప్రశాంత్ ,నరేష్ ,మధు, మల్లేశ్వరం కస్తూరి ప్రభాకర్, సమత ప్రసాద్ ఏటీపీ సంతోష్, ఉపాధ్యాయులు అధ్యాపకులు పాల్గొన్నారు.

## తెలంగాణలో అడుగుడిన దమ్మ పాదయాత్ర

**ఘనంగా స్వాగతం పలికిన బుద్ధవనం అధికారులు**

నాగార్జునసాగర్, ఫిబ్రవరి, 10 (వాయిస్ టుడే ప్రతినిధి) : ఫిబ్రవరి ఒకటవ తేదీన కర్ణాటక రాష్ట్రంలో కలబురగి లో ప్రారంభమైన దమ్మ పాదయాత్ర సోమవారం సాయంత్రం తెలంగాణ రాష్ట్రంలో మడిగి ప్రాంతంలో అడుగు పెట్టి మంగళవారం బుచ్చి నెల్లికి చేరుకుంది. దమ్మ పాదయాత్ర తెలంగాణ రాష్ట్రంలో అడుగుపెట్టిన సందర్భంగా బుద్ధ వనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య ఆధ్వర్యంలో పాదయాత్ర బృందానికి బుద్ధవనం కండువాలతో ఘనంగా స్వాతం పలికారు. అనంతరం వారికి ఈరోజు ఉదయం మాడిగిలో స్థానికప్రజలు పెద్దసంఖ్యలో స్వాగతం తెలిపారు, బౌద్ధభిక్షువుల బోధనలు, బుద్ధదాతువుల సందర్శన తరువాత అత్యంత వైభవముగా మొదలైన దమ్మయాత్ర బుచినెల్లివరకు జరిగిన యాత్ర లో సంఘా ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రా సొంగషాక్ కోవిడో, థాయిలాండ్, బౌద్ధభిక్షువులు, గగన్ మాలిక్ ఫౌండేషన్ అధ్యక్షులు గగన్ మాలిక్, బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య, కే కే రాజా,మూర్తి, సిద్ధోజి, వీరితోపాటు బుద్ధ వనం ఆర్ట్స్ మరియు ప్రమోషన్స్ మేనేజర్ శ్యాంసుందర్రావు, కిశోర్, తదితరులు ఉన్నారు. పాల్గొన్నారు. ఈనెల 18వ తేదీన హుస్సేన్ సాగర్ బుద్ధవిగ్రహం సందర్శన అనంతరం మహా బోధి బుద్ధ విహార కు చేరుకొని 19వ తేదీన అక్కడ పలు కార్యక్రమంలో పాల్గొంటారు. మార్చి ఒకటో తేదీన నాగార్జునసాగర్ చేరుకొని రెండవ తేదీన నాగార్జున కొండ మ్యూజియాన్ని సందర్శిస్తారు. మార్చి మూడవ తేదీన బుద్ధ వనములో ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొంటారని మల్లేపల్లి లక్ష్మయ్య ఒక ప్రకటనలో తెలియజేశారు.

